


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఖమ్మం

KHAMMAM

శనివారం, 23 ఆగస్టు 2025



పేదల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో పెట్టుకుని.. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద అందించే సొమ్ముల విషయంలో జిల్లాలోని కొన్ని ఆస్పత్రుల వారు కక్కుర్తి పడుతున్నారు. విజిలెన్స్ విచారణ చేసి కేసులు నమోదుచేసి సదరు ఆస్పత్రులను సీజ్ చేస్తున్నా.. కొందరు మళ్లీ ఆస్పత్రుల పేర్లను మార్చి కొత్త పేర్లతో అవతారమెత్తుతున్నారు. మరికొందరు కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకుని యథావిధిగా వైద్య సేవలందిస్తున్నారు. జిల్లాలో ఈ పరిస్థితి కారణంగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నా ఆసుపత్రుల యాజమాన్యాలు, సంబంధిత వైద్యులు వైద్యారోగ్యశాఖ లొసుగులను అవకాశం చేసుకుని యథావిధిగా తమ అక్రమాలను కొనసాగిస్తున్నారు..



సీజ్ చేసినా...

- పలు ఆస్పత్రుల్లో అడ్డదారిన కొనసాగుతున్న వైద్యం
- సీఎం రిలీఫ్ ఫండ్ అక్రమాలు.. కానరాని నిఘా

ఖమ్మం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం సహాయనిధి కింద ప్రభుత్వం అందించే సహాయాన్ని అడ్డదారిలో పొందేందుకు జిల్లాలో రోగులు లేకపోయినా ఉన్నట్టు రికార్డులు సృష్టించి వారికి ఆపరేషన్లు చేసినట్టు, వైద్య అందించినట్టు బిల్లులు పెట్టి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఆర్ఎంపీల ద్వారా తమకు నమ్మకం ఉన్న వ్యక్తుల పేర్లపైనా ఈ బిల్లులు పెట్టి ప్రజాప్రతినిధుల ద్వారా సిఫారసులు చేయించారు. అయితే సీఎం పేషీలో ఖమ్మం జిల్లా ఆసుపత్రుల్లో పెద్దమొత్తంలో వస్తున్న బిల్లులపై విజిలెన్స్ విచారణ జరిపించారు. ఒక చిన్న ఆసుపత్రిలో 168 బిల్లులు పెట్టడంతో ఉన్నతాధికారులకు అనుమానం రాగా.. విజిలెన్స్ విచారణ జరిపి ఇవన్నీ దొంగబిల్లులని తెలిసి ఆసుపత్రిని సీజ్ చేశారు.

పది ఆస్పత్రుల మూత.. మళ్లీ కొన్ని తెరపైకి..

ఖమ్మం కేంద్రంగా సుమారు 17 ఆస్పత్రుల బిల్లులపైనా అనుమానాలు రావడంతో రాష్ట్రస్థాయిలో వైద్యారోగ్యశాఖ విజిలెన్స్ బృందం తనిఖీలు నిర్వహించి జిల్లా వైద్యారోగ్యశాఖ ద్వారా నోటీసులు జారీచేసింది. దీంతో పది వరకు ఆస్పత్రులను మూసేశారు. అందులో కొన్ని సీజ్ చేయగా.. కొందరు కోర్టు ద్వారా అనుమతులు తెచ్చుకుని మళ్లీ తెరిచారు. ఇంకొందరు పూర్తిగా మూసేసి.. కొత్త పేరుతో ఆసుపత్రులను తెరిచి వైద్యసేవలు నడిపిస్తున్నారు. అలా తెరిచిన వాటికి కూడా సీఎం రిలీఫ్‌ఫండ్ అనుమతి తెచ్చుకోవడం, సీఎం ఫొటోతో ప్రచారం చేసుకోవడం గమనార్హం. ప్రైవేటు ఆసుపత్రుల వారు ముఖ్యమంత్రులు, మంత్రులు, డాక్టర్ల ఫొటోలు పెట్టకూడదు. కానీ ఇందుకు విరుద్ధంగా ఖమ్మం కేంద్రంలో పలు ఆసుపత్రుల వద్ద కొందరు ముఖ్యమంత్రి ఫొటోనే పెట్టి రోగులను బురిడీ కొట్టిస్తున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ అమల్లో ఉన్న ఆసుపత్రులు ఆరోగ్యశ్రీలోగో లేదా సీఎం రిలీఫ్ ఫండ్ వెసులుబాటు ఉన్నట్టు సమాచారాన్ని ప్రదర్శించాలి. ప్రైవేటు ఆసుపత్రుల వారు ఇలా నిబంధనలు పక్కనపెట్టినా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

17హాస్పిటళ్లలో అవకతవకలు..

సీఎంరిలీఫ్ ఫండ్ బిల్లులకు సంబంధించి 17 ఆసుపత్రుల్లో అవకతవకలు జరిగాయని, విచారణ చేయాలని ఆదేశించినా కొన్ని ఆసుపత్రుల్లోనే విచారణ పూర్తిచేశారు. అయితే బిల్లులపై సంతకాలు పెట్టిన డాక్టర్లపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కనీసం పోలీసులకు కూడా ఫిర్యాదు చేయలేదు. ఖమ్మం

(మిగతా 8వ పేజీలో)

ఆస్పత్రులపై చర్యలు తీసుకున్నాం

కళావతిబాయి, డీఎంహెచ్‌వో



పైస్థాయిలో విజిలెన్స్ బృందం ఆసుపత్రులను సీజ్ చేశాం. పదిపైగా ఆసుపత్రులను సీజ్ చేశామని డీఎంహెచ్‌వో కళావతిబాయి వివరణ ఇచ్చారు. కొన్ని ఆస్పత్రుల వారు కోర్టు స్టేద్వారా మళ్లీ నడిపిస్తున్నారు. ఆస్పత్రుల వద్ద ముఖ్యమంత్రి ఫొటోలు వాడుతున్న విషయం తమ దృష్టికి రాలేదని, అలా పెట్టుకోవచ్చో లేదో అన్నదానిపై నిబంధనలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామని తెలిపారు.



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

సాధారణ స్థితికి..

- భద్రాద్రి వద్ద గోదావరి మరింత తగ్గుముఖం
- మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

భద్రాచలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి నీటిమట్టం సాధారణ స్థాయికి చేరుకుంటోంది. మూడు రోజులుగా భద్రాచలం వద్ద ఉగ్రరూపం దాల్చి ప్రవహించిన గోదావరి మరింత తగ్గుముఖం పట్టింది. ఈ క్రమంలో గురువారం రాత్రి 11 గంటల వరకు 51.9 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ శుక్రవారం ఉదయం 6 గంటలకు 49అడుగులకు తగ్గింది. ఆ తర్వాత 9 గంటలకు 47.9 అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ఉపసంహరించారు. మధ్యాహ్నం 12 గంటలకు 46.6 అడుగులకు, 3 గంటలకు 45.3 అడుగులకు తగ్గింది. సాయంత్రం 6 గంటలకు 43.9 అడుగులకు, రాత్రి 9 గంటలకు 42.8 అడుగులకు రావడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. రాబోయే 24 గంటల్లో గోదావరి నీటిమట్టం మరింతగా తగ్గే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం



భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చి 51.9 అడుగుల వద్ద ప్రవహించి అనంతరం తగ్గుముఖం పట్టడంలో జిల్లా

(మిగతా 6వ పేజీలో)



సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల, యోగితారాణా తదితరులు

రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచానికి చాటేలా..

- 300ఎకరాల్లో మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ నిర్మాణం
- త్వరలో విశ్వ విద్యాలయాన్ని ప్రారంభించనున్న సీఎం
- మంత్రి తుమ్మల.. హైదరాబాద్‌లో సమీక్ష



ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) / కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 22 : రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పేలా.. కొత్తగూడెంలోని మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ నిలవబోతోందని, దేశానికి తలమానికంగా ఉండేలా 300 ఎకరాల్లో నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో మన్మోహన్‌సింగ్ యూనివర్సిటీ నిర్మాణంపై ఆర్కిటెక్ట్ ఉష, వైస్ చాన్సలర్ యోగితారాణ తదితర అధికారులతో ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో (మిగతా 6వ పేజీలో)

రెండోసారి కూనంనేనికే..

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సాంబశివరావు



ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 22: సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా రెండోసారి కూడా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎన్నికయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఆయన్ను శుక్రవారం మేడ్చల్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2022లో శంషాబాద్‌లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో తొలిసారి సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఆయన గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పొత్తుతో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొంది శాసనసభలో సీపీఐ పక్ష నేతగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మేడ్చల్‌లో మూడురోజులుగా జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభల చివరిరోజున రెండో సారి ఆయన్ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. 2005 నుంచి 2009 వరకు సీపీఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేసిన కూనంనేని 2009లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీ చేసి అప్పటి మంత్రి వనమాపై ఎమ్మెల్యేగా గెలిచారు. మళ్లీ 2023లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి ఎన్నికై ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా గడిచిన మూడేళ్లలో రంగారెడ్డి, వరంగల్, హన్మకొండ, భూపాలపల్లి, మేడ్చల్, మహబూబాబాద్ జిల్లాలో అనేక భూపోరాటాలు నిర్వహించి ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు, సాగుభూమిని పంపిణీ చేశారు. వామపక్షం నుంచి ఒకే ఒక్క శాసనసభ్యుడిగా ఉన్న కూనంనేనికి అసెంబ్లీ సమావేశాల్లో అయన చేసిన ప్రసంగాలు, సమస్యల ప్రస్తావనలకు వివిధ వర్గాల నుంచి ప్రసంశలు అందుకుంటున్నారు. 2023లో జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీపీఐ అనుబంధ సింగరేణి కాలరీస్

(మిగతా 6వ పేజీలో)



ఆ సారు ఎవరు?

- పోలీసు అధికారి వసూళ్లపై నిఘా వర్గాల ఆరా
- హోటల్ యజమాని నుంచి డబ్బు డిమాండ్ చేసింది నిజమేనని నిర్ధారణ?
- తీవ్ర చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం

ఖమ్మంక్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఓ పోలీసు అధికారి.. కారు రిపేరు నిమిత్తం ఓ హోటల్ యజమానిని డబ్బులు డిమాండ్ చేశాడంటూ 'సారూ ఇదేం పని?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనం చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో శుక్రవారం ఉదయం పోలీసుశాఖ నిఘావర్గాలు రంగంలోకి దిగాయి. అసలు ఆ సారు ఎవరు? ఆయన హోటల్ యజమాని నుంచి డబ్బులు డిమాండ్ చేశారా? లేదా? అని ఆరా తీశాయి. ఇదిలా ఉంటే నాలుగురోజుల క్రితమే ఈ విషయం పోలీసు దృష్టికి వెళ్లినట్టు సమాచారం. కాగా శుక్రవారం ఉదయం నిఘావర్గాలకు చెందిన సిబ్బంది సదరు హోటల్ యజమాని వద్దకు వెళ్లి వివరాలు కూడా తెలుసుకున్నారని, అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్టు తెలిసింది. అలాగే పాల్పడిన సదరు పోలీసు అధికారిపై సహకరించిన గన్‌మెన్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది. ఇదిలా ఉంటే ఎన్నడూ లేనివిధంగా సదరు హోటల్ ఎదుట నిలిపిన వాహనాలను డబ్బు డిమాండ్ చేసిన పోలీసు అధికారి విధులు నిర్వహించే స్టేషన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ వచ్చి ఫొటోలు తీసినట్టు తెలిసింది. అయితే ఓ కేసు నిమిత్తం మధ్యప్రదేశ్‌లో విచారణకు వెళ్లిన సదరు పోలీసు అధికారి సిబ్బందికి ఫోన్‌చేసి తీసిన ఫొటోలు డిలీట్ చేయాలని ఆదేశించినట్టు సమాచారం.

మైనార్టీ గురుకులానికి జ్వరం!

తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన ఎనిమిది మంది విద్యార్థులు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 22 : సత్తుపల్లి పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకులంలో పదుల సంఖ్యలో విద్యార్థులు జ్వరం బారిన పడ్డారు. వారిలో ఎనిమిది మంది విద్యార్థులకు ఒకేసారి తీవ్ర అస్వస్థతతో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. రెండు, మూడు రోజుల నుంచి గురుకులంలో చదువుతున్న విద్యార్థులు దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతుండగా వసతి గృహంలో చికిత్స పొందారు. ఆ తర్వాత జ్వర తీవ్రత ఎక్కువ అవ్వడంతో ఆటోలో గురుకులం సిబ్బంది ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆందోళనకు గురైన విద్యార్థులు తల్లిదండ్రులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాల్సి ఉందని, రెండు మూడు రోజుల నుంచి జ్వరాలతో బాధపడుతుంటే తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సత్తుపల్లి పరిసరాల ప్రాంతాలైన నారంవారిగూడెం, కిష్టారం, లంకపల్లి, అమ్మపాలెం, బనిగండ్లపాడుకు చెందిన ఎం.నాగాదిత్య, షేక్ సుఫీయాన్, నాగేంద్రకాంత్, సాయివర్ధన్, హేమంత్, సందీప్, టీ.నాగశ్రీఅఖిల్, ఎస్‌కే.మహ్మద్ జాషీర్‌లు తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రికి చేరుకున్నారు. అయితే తాము వచ్చేవరకు పిల్లల బాగోగులు చూసుకోవాల్సిన ప్రిన్సిపాల్‌గానీ, ఉపాధ్యాయులు గానీ ఆసుపత్రిలో కనిపించలేదని, సిబ్బందితో తమ పిల్లలకు చికిత్స అందించారని తల్లిదండ్రులు ఆరోపించారు. చెప్పారు.



సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

సరైన ఉపాధి చూపాలి

బూడిదంపాడులో పనుల జాతర - 2025

ప్రారంభించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

రఘునాథపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు హక్కుగా భావించాలని, సరైన ఉపాధిని పొందాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. శుక్రవారం రఘునాథపాలెం మండలం బూడిదంపాడులో పనుల జాతర 2025లో భాగంగా ఉపాధి హామీ పథకంలో నిర్మాణం చేపట్టిన షెడ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం కూలీలు, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. రైతులు ఎలాంటి పంటలు సాగు చేస్తున్నారు. రైతుభరోసా నిధులు ఎంతమందికి వచ్చాయనే వివరాలను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ పనుల జాతర ఉద్దేశ్యాలను వివరించారు. ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సయ్య, తహసీల్దార్ శ్వేత పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

గిరిజన మహిళల ఆర్థిక బలోపేతానికి

ఐటీసీ సహకరించాలి

భద్రాచలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గిరిజన మహిళల ఆర్థిక బలోపేతానికి ఐటీసీ తగిన విధంగా సహాయ సహకారాలు అందించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ యూనిట్ గిరిజన మహిళలు తయారు చేసిన న్యూట్రిమిక్స్ ఉత్పత్తులు, మిల్లెట్ బిస్కెట్లు, ఇప్పపువ్వు లడ్డు, సబ్బులు, షాంపూలు తినుబండారాలను ఐటీసీ అధికారుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో రాహుల్ మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ యూనిట్లకు ఐటీసీ సహకారం అందిస్తే మరింత బలోపేతం అవుతాయన్నారు. గిరిజన మహిళలు తయారు చేసే ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండి ప్రజలను ఆకర్షించే విధంగా తయారు చేయాలన్నారు. అనంతరం దమ్మక్క జాయింట్ లయబిలిటీ గిరిజన గ్రూపు సభ్యులు కొత్తగా తయరు చేసిన మోవా సోప్‌ను బ్యాంబో సోప్‌నుపీవో రాహుల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, ఐటీసీ మేనేజర్ చంగల్‌రావు, జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు.

ఉద్దీపకం వర్క్‌బుక్-2 అమలుపై ప్రత్యేక సమావేశం

శుక్రవారం పీఎంఆర్‌సీ భవనంలో జిల్లాలోని ఎస్‌సీఆర్‌పీలతో ఉద్దీపకం వర్క్‌బుక్-2 అమలు కార్యాచరణపై పీవో రాహుల్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. ఉద్దీపకం వర్క్‌బుక్‌ను పాఠశాలల్లో ప్రవేశపెట్టడం వల్ల గిరిజన పిల్లల విద్యాభ్యాసం చాలా వరకు మెరుగు పడిందన్నారు. దసరా వరకు ఉద్దీపకం-2 వర్క్‌బుక్‌ను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా ఉత్సవాలు

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన పేరిట ప్రతీ సంవత్సరం ఆగస్టు 29న నిర్వహిస్తున్న జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఈనెల 23 నుంచి 31వ తేదీ వరకు క్రీడా దినోత్సవ వేడుకలను ఘన ంగా నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో 9 రోజుల పాటు నిరంతరంగా క్రీడా పోటీల నిర్వహణ ఉంటుందన్నారు. వేడుకలలో భాగంగా వైద్య శిబిరాలు, కల్చరల్ ప్రోగ్రామ్స్, చిన్నపిల్లల నుంచి సీనియర్ సిటిజన్స్, పారా అథ్లెట్లకు క్రీడా పోటీలు, ఫన్నీ గేమ్స్ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈనెల 23న ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంతో పాటు కల్లూరు, మధిర, వైరాలో 10 ఏళ్ల లోపు పిల్లలకు స్కేటింగ్, టేబుల్‌టెన్నిస్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, షటిల్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 24న జిల్లాలోని అన్ని క్రీడా మైదానాలలో క్రీడా పోటీలు, 25న సర్దార్ పటేల్ స్టేడియంలో మెగా హెల్త్ క్యాంప్, 26న సీనియర్ సిటిజన్స్ విభాగంలో మహిళలకు, పురుషులకు అథ్లెటిక్స్ పోటీలు, 27న ఫన్నీ గేమ్స్, కల్చరల్ ప్రోగ్రామ్స్, 28న స్కూళ్లు, కాలేజీలు, గురుకులాల ఆధ్వర్యంలో ఫిజికల్ లిటరసీ ప్రోగ్రామ్స్, 29న నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా స్టేడియం నుంచి జడ్పీ సెంటర్ వరకు ఎన్ఎస్‌డీ రన్, విజేతలకు బహుమతుల ప్రధానం, 30న బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో మోటివేషన్ శిబిరం, 31న సైక్లింగ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు, ఔత్సాహికులు ఇతర సమాచారం కోసం సర్దార్ పటేల్ స్టేడియంలోని క్రీడల కార్యాలయంలో నేరుగా గానీ, లేనిపక్షంలో 9618718929 నెంబర్‌లో గానీ సంప్రదించాలని డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి కోరారు.

రోగులకు వరంలా డయాలసిస్ సెంటర్

» మణుగూరు ఏరియా ఆస్పత్రిలో కేంద్రం ఏర్పాటు » ఇప్పటి వరకు ఏడు వేల మందికి సేవలు



మణుగూరులోని డయాలసిస్ సెంటర్

మణుగూరు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో మూత్ర పిండాల వ్యాధితో బాధపడే రోగులకు మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ ఓ వరంగా మారింది. ఎందరో ప్రాణాలను కాపాడుతూ ప్రాణదాతగా నిలుస్తోంది. ప్రస్తుతం ప్రజల జీవన విధానాలలో వచ్చిన మార్పులతో అధిక శాతం కిడ్నీ జబ్బులకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ బాధితులు అధికంగా ఉంటున్నారు. ఖమ్మం కొత్తగూడెం, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల్లోనే కార్పోరేట్ ఆసుపత్రుల్లో డయాలసిస్ కోసం లక్షలాది రూపాయాలను వెచ్చిస్తూ ఆర్థిక భారాన్ని మోయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో డయాలసిస్ బాధితుల ఆర్థిక ఇబ్బందులను గమనించి ఏజెన్సీ ప్రాంత ప్రజలకు డయాలసిస్ సేవలను కల్పించేందుకు 2023, మే 24వ తేదీన డయాలసిస్ సెంటర్‌ను మణుగూరులో ఏర్పాటు చేశారు. ఖరీదైన వైద్యం ఉచితంగా అందుబాటులోకి రావడంతో రోగులు సంతృప్తి చెందుతున్నారు. ఈ కేంద్రంలో ఐదు పడకలు, ఐదు మిషన్లు ఉన్నాయి. అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం, పాల్వంచ బూర్గంపాడు. మంగపేట మండలాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు కూడా ఇక్కడి కేంద్రంలో సేవలు పొందుతున్నారు. నిరంతర విద్యుత్ సరఫరా చేసే విధంగా రూ. 5లక్షల విలువైన 40 కేవీ జనరేటర్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌లో మేనేజర్‌తో పాటు ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఇద్దరు టెక్నీషియన్లు, హౌస్‌కీపర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం 35మంది బాధితులు రోజు విడిచి మరునటి రోజు డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు ఏడు వేల మంది సేవలు వినియోగించుకున్నారు.

ఆర్థిక, దూరాభారం పోయింది..

● సంతోష్ రెడ్డి, డయాలసిస్ కేంద్ర మేనేజర్

కిడ్నీ వ్యాధిగ్రస్తులు గతంలో లాగా ప్రస్తుతం ఆర్థిక, దూరాభార ప్రయాణాలు చేయాల్సిన అవసరం లేదు.. వేలాది రూపాయల ఖర్చులేకుండా మణుగూరు సెంటర్ ద్వారా ఉచిత సేవలు పొందుతున్నారు. రోగులకు ఉచిత బస్ పాస్, నెలకు రూ 2016 పెన్షన్ కూడా కల్పిస్తున్నాం. ఇప్పటివరకు ఏడు వేల మందికి సేవలందించడం జరిగింది. కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఈ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

ఖమ్మం వెళ్లే పరిస్థితులు పోయాయి..



పొనగంటి నవీన్ శేషగిరినగర్, మణుగూరు

నేను గత రెండేళ్ల నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నా. ఇందుకోసం ఖమ్మం వెళ్లేవాడిని.. గతంలో రాకపోకలు, ఆర్థిక ఇబ్బందులతో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నా.. కానీ గత ఆరు నెలల నుంచి మణుగూరు కేంద్రంలో డయాలసిస్ చికిత్స పొందుతున్నాను. ఎంతో సంతోషంగా ఉంది. ఈ కేంద్రంలో సిబ్బంది సేవలు సంతృప్తిగా ఉన్నాయి.

సిబ్బంది సేవలు అభినందనీయం



చెందు వెంకటేశ్వర్లు, టేకుల చెరువు

మాకు దగ్గరలోని మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఉండడం సంతోషంగా ఉంది. ఇది మాకు ఎంతో మేలు చేసినట్లైంది. నేను గత రెండు సంవత్సరాలుగా ఈ కేంద్రంలో డయాలసిస్ సేవలు పొందుతున్నాను. ఇక్కడి వైద్యులు, సిబ్బంది సిబ్బంది రోగులకు అందిస్తున్న సేవలు అభినందనీయం.



యూరియా కోసం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

సాగు అవసరాలకు..

సరిపడా యూరియా ఇవ్వాలి

● న్యూడెమోక్రసీ నాయకుల డిమాండ్

ఇల్లెందురూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రైతుల సాగు అవసరాలకు సరిపడా యూరియా అందజేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చుడాలని న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు తుపాకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు రైతులకు యూరియా అందించడంలో విఫలమయ్యాయన్నారు. ఎరువుల కోసం రైతులను ఇంత ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఇబ్బందులు గురిచేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పేరోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. యూరియాను రైతులకు అందించకుండా అధికార పార్టీ నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు సరిపడా యూరియా చేసే వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో నాయకులు పొడుగు నర్సింహరావు, మోతిలాల్, సారంగపాణి, మూడు మాలు, జోగ కృష్ణ, కోటన్న, రాజు, నరాటి వెంకన్న, మోకాళ్ల రమేష్, రావురి ఉపేందర్, కొండపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడులో సెల్‌ఫోన్ల అందజేత

బూర్గంపాడు, ఆగస్టు 22: బూర్గంపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కారణాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన సెల్‌ఫోన్‌లను శుక్రవారం ఎస్సై ప్రసాద్ బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాప్యం.. ఆపై కుటుంబ భారం!

» అతి కష్టమ్మీద సంతానాన్ని సాకుతున్న వృద్ధురాలు
» మరింత కుంగదీస్తున్న కూతురు, కుమారుడి అనారోగ్యం

సత్తుపల్లి రూరల్, ఆగస్టు 22 : ఓ వైపు వృద్ధాప్యం.. మరోవైపు మానసికంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న కూతురు, కుమారుడి ఆలనాపాలనా ఆ అభాగ్యురాలికి భారంగా మారాయి. కడు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న ఆమెకు ప్రభుత్వం నుంచి ఆర్థిక భరోసా కూడా దక్కని దీన స్థితిని ఎదుర్కొంటోంది సత్తుపల్లి ఎన్టీఆర్ కాలనీకి చెందిన మామడి కటాక్షమ్మ. కటాక్షమ్మ, ముత్తయ్య (లేటు) దంపతులకు ఆరుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆరుగురికి వివాహం జరగ్గా.. కుమారుడు శ్రీను అలియాస్ ఏసు 23ఏళ్ల పాటు ఆరోగ్యం బాగానే ఉన్నా, ఆ తర్వాత మానసికంగా అనారోగ్యం బారిన పడ్డాడు. కుమార్తెల్లో ఒకరైన సుజాతకు 15ఏళ్ల వయస్సులోనే ఏపీలోని ఉండీ భీమవరానికి చెందిన రాజేష్ అనే వ్యక్తితో వివాహం చేశాడు. కూతురు, కుమారుడు పుట్టిన రెండేళ్ల తర్వాత ఆమె కూడా మానసిక సమస్యల బారిన పడి ఇద్దరినీ తీసుకొని పుట్టింటికి వచ్చింది. ఇలా 17 ఏళ్లుగా కుమారుడు ఏసు, కూతురు సుజాత, మనవడు, మనవరాలి బాగోగులను కటాక్షమ్మే చూస్తోంది. వారికి హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చికిత్స చేయిస్తూ వచ్చింది. ఈ క్రమంలో సుజాత కొంతమేర కోలుకోవడంతో తన కాళ్లపై తాను నిలబడి పిల్లలను పోషించుకుంటూ వచ్చింది. కానీ ఆ ఆనందం ఎంతోకాలం నిలవలేదు. కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకునే క్రమంలో మందులు వాడకపోవడం, ఆర్థికంగా వెనుకబడి ఉండడం.. కుటుంబ పోషణ భారమవ్వడం, పెద్దదిక్కు లేని కారణంగా పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇక కుమారుడు కూడా దాదాపు అదే పరిస్థితి. మందులు వేసుకుంటూ గ్రామంలో చిన్నా చితకా కూలి పనులకు వెళుతూ అక్కడివారు ఇచ్చింది తెచ్చుకుంటాడు. కానీ వారిద్దరి ఆలనాపాలనా వృద్ధాప్యంలోని కటాక్షమ్మకు భారమైంది. కుటుంబ సభ్యుల సహకారంతో ఎర్రగడ్డ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించేందుకు ముందుకు వచ్చినా మతిస్థిమితం సరిగ్గా లేని సుజాత, ఏసు అందుకు సహకరించని పరిస్థితి. దీంతో కటాక్షమ్మ తీవ్ర మనోవేదనకు గురవుతోంది.



దిక్కుతోచని స్థితిలో సుజాత, కటాక్షమ్మ

దివ్యాంగుల పింఛన్ కోసం ఎదురుచూపు

ఇక కూలేందుకు సిద్ధంగా ఉండి శిథిలావస్థకు చేరిన ఇంటిలో జీవిస్తున్న ఆ బాధితుల పరిస్థితి వర్ణనాతీతం. తల్లి, మేనమామ ఆ పరిస్థితిలో ఉండటం, అమ్మమ్మ వృద్ధురాలు కావడంతో.. సుజాత కుమారుడు, కుమార్తె చదువును పక్కనబెట్టి కుటుంబ జీవనం కోసం కూలి పనులకు వెళ్తున్నారు. రేషన్ ద్వారా సన్నబియ్యం వస్తున్నా.. తనకు వృద్ధాప్య పింఛన్ వస్తున్నా.. సరుకులు, కుటుంబ అవసరాలు, పోషణ భారమవుతోందని కటాక్షమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో తన కుమారుడు, కుమార్తెలకు కూడా దివ్యాంగుల పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.

నకిలీ మద్యం తయారీ గుట్టురట్టు

రెండు కార్లు, నకిలీ మద్యం సామగ్రి స్వాధీనం
ఐదుగురి అరెస్టు, పరారీలో మరో ఇద్దరు
నిందితుల్లో ఒకరు ఖమ్మం గోపాలపురం వాసి
వివరాలు వెల్లడించిన మహబూబాబాద్ ఎస్పీ



నకిలీ మద్యం తయారీ సామగ్రిని చూపుతున్న సుధీర్ రాంనాథ్ కేకన్



మానుకోట టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నకిలీ మద్యం తయారీ ముఠా గుట్టును టౌన్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు రట్టు చేశారు. ఘటనా స్థలం నుంచి రెండు కార్లు, 5 సెల్‌ఫోన్లుతో పాటు సుమారు రూ. 4.50 లక్షల విలువైన నకిలీ మద్యం సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ శుక్రవారం వెల్లడించారు. వరంగల్ జిల్లా శాయంపేటకు చెందిన అల్లం రవీందర్ మధ్యప్రదేశ్ నుంచి అక్కడి మద్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా వరంగల్ ప్రాంతంలో ఎక్కువ ధరకు అమ్మేవాడు. ఈ క్రమంలో మహారాష్ట్ర నాగపూర్ చెందిన ఆశీష్‌ఠాకూర్‌తో పరిచయం ఏర్పడింది. వీరిద్దరు మఠాగా ఏర్పడి మధ్యప్రదేశ్ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు మద్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేవారు. ఇంకా సులువైన పద్ధతిలో డబ్బులు సంపాదించాలనే దురాశతో ఖమ్మం నగరంలోని గోపాలపురానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు సాబీర్ పాషాతో పరిచయం ఏర్పడింది. నకిలీ మద్యం తయారు చేయాలని నిశ్చయించుకున్నారు. దీనిలో భాగంగా సాబీర్‌పాషతో రూ. 1,50,000 లతో గుట్టుగా స్పిరిట్ తెప్పించారు. వీరితో వరంగల్ పెరికవాడకు చెందిన ములుగు రాజు, మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన పంచాయతీ కార్యాదర్శి ఓర్సు గోపాలక్రిష్ణ, అదే గ్రామానికి చెందిన రెస్టారెంట్ నిర్వాహకుడు జక్కుల రమేష్, వరంగల్‌కు చెందిన రామ్‌తేజలు కలిసి నకిలీ మద్యం తయారు చేసేందుకు సిద్ధమయ్యారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇల్లందు రోడ్డు జ్యోతిబసు కాలనీ ఇనాని రాజగోపాల్‌కు చెందిన గోదాంను నెలకు రూ. 27 వేలకు అద్దెకు తీసుకున్నారు. గోదాములో నకిలీ మద్యం తయారు చేసి తరలించేందుకు సిద్ధంగా ఉంచినట్లు పక్కా సమాచారం అందడంతో మహబూబాబాద్ టౌన్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఘటనా స్థలం నుంచి రెండు కార్లు, ఐదు సెల్ ఫోన్లు, 2688 మద్యం బాటిళ్లు, 4500 ఖాళీ సీసాలు, 60 లీటర్ల స్పిరిట్, 2 వేలు సీసా మూతలు, 1755 ఓల్డ్ అడ్మిరల్ స్టిక్కర్లు, 100 ఎమ్టీ కాటన్లు, 2 ప్లాస్టిక్ డ్రమ్ములు, ఒక ప్లాస్టిక్ టబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏడుగురిపై కేసు నమోదు చేయగా, ఐదుగురు ఓర్సు గోపాలకృష్ణ, షేక్ సాబీర్‌పాషా, జక్కుల రమేష్, అల్లం రవీందర్, ములుగు రాజు అరెస్టు చేశామని, వరంగల్‌కు చెందిన రామ్‌తేజ, మహారాష్ట్రకు చెందిన ఆశీష్‌ఠాకూర్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి, సిబ్బంది, ఎక్సైజ్ అధికారులను అభినందించి నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరంటెండెంట్ కిరణ్‌నాయక్, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై ప్రశాంత్, ఎక్సైజ్ అధికారులు ఉన్నారు.

రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచానికి చాటేలా..

(5వ పేజీ తరువాయి)

సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో మౌలిక సదుపాయాలతో యూనివర్సిటీ నిర్మాణం ఉంటుందని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా నాణ్యతా ప్రమాణాలతో ప్లాన్ రూపొందించాలని సూచించారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, లెక్చరర్లకు సౌకర్యాలు, వసతిగదులు, లైబ్రరీ, హాస్టళ్లు, ల్యాబ్ డిజైన్ చేయాలని పూర్తిస్థాయి డిజైన్లు అయిన తర్వాత సీఎంకు చూపిస్తామని, ఆయన ఆదేశాలకు అనుగుణంగా డిజైన్లు ఆమోదం తీసుకోవాలని సూచించారు. సీఎం అనుమతిచ్చిన వెంటనే వర్సిటీ ప్రారంభోత్సవ వేడుక ఘనంగా ఉంటుందని వెల్లడించారు. అందుబాటులో ఉన్న భవనాల్లో తాత్కాలికంగా తరగతులు నిర్వహించాలని, హాస్టల్ భవనాలకు మరమ్మతులు చేయాలని ప్రస్తుతం ఉన్న వసతులను వినియోగించుకోవాలని సూచించారు. మూడేళ్లలో అన్ని భవనాలను పూర్తి చేయాలని, ఈ యూనివర్సిటీ దేశంలోనే మొట్టమొదటిదని, భవనాలను ఆకర్షణీయంగా, మోడల్‌గా నిర్మించాలన్నారు. వేలాదిమంది శాస్త్రవేత్తలను తీర్చిదిద్దేలా ఈ యూనివర్శిటీ రూపకల్పన చేయడం జరిగిందన్నారు. మైనింగ్ కళాశాల గా ఉనర్న కాలేజీని విశ్వవిద్యాలయంగా మార్చడంజరిగిందని, ఈ విశ్వవిద్యాలయం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి మరింత వేగిరమవుతుందన్నారు.

రెండోసారీ కూనంనేనికే..

(5వ పేజీ తరువాయి)

వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘంగా గెలుపొందడంలో, కొత్తగూడెం నియోజకవర్గంలో ఎక్కువ సంఖ్యలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గెలిపించడంలో అయన కీలకపాత్ర పోషించారు. ఎమ్మెల్యేగా ఉన్న సాంబశివరావు పార్టీ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషిచేసే ఆస్కారం ఉంటుందని భావించి.. నాయకత్వం తిరిగి ఆయనకే పగ్గాలు అప్పగించినట్టు తెలుస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కోల్‌బెల్ట్, సింగరేణి ఎన్నికలు తదితర అవసరాల దృష్ట్యా సాంబశివరావుకు మరో అవకాశం లభించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన కూనంనేనికి రెండో సారి రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం దక్కడంతో ఉమ్మడి జిల్లా సీపీఐ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

భద్రాద్రి జిల్లా నుంచి 13మందికి చోటు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని ఎన్నికకాగా.. జిల్లా నుంచి మరో 13 మందికి రాష్ట్ర పదవులు దక్కాయి. జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కె.సారయ్య, మున్నా లక్ష్మీకుమారి, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, వై.ఉదయ్‌భాస్కర్, ఎస్‌డీ సలీం, రావులపల్లి రవికుమార్, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్‌కు రాష్ట్ర సమితిలో చోటు దక్కింది. వారితోపాటుగా సింగరేణి యూనియన్ నాయకుడు మిర్యాల రంగయ్యను రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సాధారణ స్థితికి..

(5వ పేజీ తరువాయి)

యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. భద్రాచలం-చర్ల మార్గంలో రహదారులపై వరద నీరు తొలగింది. దుమ్ముగూడెం మండలం తూరుబాక వద్ద డైవర్షన్ రోడ్డు బురదగా ఉండటంతో వాహన చోదకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాగా తెలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో భద్రాచలం నుంచి నెల్లిపాక వెళ్లే మార్గంలో సైతం రాకపోకలు పునరుద్ధరించారు. ఇదిలా ఉండగా కరకట్ట వద్ద ఉన్న దేవస్థానం కల్యాణ కట్టను రెండు రోజులుగా మూసివేయడంతో వంద గదుల సత్రం వద్దే భక్తులు తలనీలాలు సమర్పిస్తున్నారు. కాగా కల్యాణ కట్ట కింది భాగంలో చాలావరకు నీరు తగ్గింది. స్నానఘట్టాలపై వరద నీరు ఇంకా ప్రవహిస్తోంది. తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు, గజ ఈతగాళ్ల బందోబస్తు కొనసాగిస్తున్నారు. అలాగే స్నానఘట్టాలకు వెళ్లే మార్గాలను మూడు రోజులుగా మూసేశారు.

విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్ల తొలిగింపు

కల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కల్లూరు, బత్తులపల్లి, పెద్దకోరుకొండి విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో పలు గ్రామాల్లో గల విద్యుత్ స్తంబాలపై ఉన్న కేబుల్ వైర్లను గురువారం విద్యుత్‌శాఖ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది తొలిగించారు. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తొలిగిస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు వెంకట్, రామిరెడ్డిలు తెలిపారు. విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్తంగా కేబుల్ వైర్లు, నిర్వహణలో ప్రత్యేక దృష్టి సారించక పోవటంతో ప్రమాదాలకు నిలయంగా మారాయని వివరించారు. నెట్‌వర్క్ ఆపరేటర్లు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ విద్యుత్‌శాఖకు చెల్లించాల్సిన రెవెన్యూ చెల్లించకుండా ఎగనామ పెట్టడం జరుగుతుంది. మరో వైపున హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదాలపై రాష్ట్ర ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకుంది. దీంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కల్లూరు విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో గల 7 వేల విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను తొలిగింపునకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పద్ధతి ప్రకారం కేబుల్ వైర్లను ఎలాంటి ప్రమాదాలు జరకుండా అమర్చుకోవాలని నెట్‌వర్క్ నిర్వహకులకు నోటీసులు పంపినట్లు విద్యుత్ ఇంజనీర్లు వెంకట్, రామిరెడ్డి తెలిపారు.

నీలాద్రిలో అన్నపూర్ణేశ్వరి ట్రస్టు ప్రత్యేక పూజలు

పెనుబల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో ఏపీలోని విజయవాడకు చెందిన అన్నపూర్ణేశ్వరి ట్రస్టు ఆధ్వర్యంలో బాల త్రిపురసుందరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అటవీ ప్రాంతంలోని నీలాద్రీశ్వర ఆలయంలో అమ్మ వారిని బాల త్రిపురసుందరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకురాలు అన్న పూర్ణమ్మ మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు చదువులకు, పేద బ్రాహ్మణులను ఆదుకోవడం, ఉచిత యోగాశిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏ సమయంలోనైనా విజయ వాడలోని అన్నపూర్ణేశ్వర ట్రస్టుకు రావచ్చన్నారు. కార్యక్రమంలో సాయికృష్ణ, తేజస్విని, సీతారామి రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నీలాద్రీశ్వర ఆలయంలో బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు

రూ.9కోట్లతో మూడుచోట్ల భవన నిర్మాణాలు

సీసీ కెమెరాల అనుసంధానంతో పర్యవేక్షణ
జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి జ్యోతి



సత్తుపల్లిలో స్టోర్‌రూమ్‌లో సరుకులు పరిశీలిస్తున్న డీబీసీడీవో జ్యోతి

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 22: రూ.9కోట్ల నిధులతో జిల్లా కేంద్రంలోని బాలికల బీసీ వసతిగృహం, ముస్తాఫానగర్, వీ.వెంకటాయపాలెం బాలుర హాస్టళ్లను నూతనంగా నిర్మిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారిణి (డీబీసీడీఓ) జీ.జ్యోతి తెలిపారు. సత్తుపల్లిలోని బీసీ బాలుర, బాలికల వసతిగృహాలను ఆకస్మికంగా సందర్శించి రికార్డులు, స్టోర్‌రూమ్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... పోటీ పరీక్షలకు సిద్ధపడే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మెటీరియల్‌తో పాటు ఇంగ్లీష్, తెలుగు అకాడమీ బుక్స్ ప్రతిచోటా అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. తిరుమలాయపాలెం (బాలికల), సత్తుపల్లి, పెనుబల్లి, చిన్నకోరుకొండి (బాలుర) వసతిగృహాలు శిథిలావస్థకు చేరగా నూతన భవనాలకై ప్రతిపాదనలు పంపించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 31 వసతి గృహాలను సీసీ కెమెరాలతో అనుసంధానం చేసి పర్యవేక్షణ చేస్తున్నామని, వాటిలో ప్రీమెట్రిక్(20), పోస్ట్ మెట్రిక్(11)లో 2600మంది విద్యార్థులు ఉన్నారని, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రత్యేక చొరవతో బెడ్లు, కుర్చీలు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏబీసీడీవో గ్రేషమ్మ, వార్డెన్లు ఉన్నారు.

తప్పుడు కథనాలను పెట్టేవారిపై చర్యలు తీసుకోండి: సీపీ

ఖమ్మంక్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పుకార్లు, తప్పుడు వార్తా కథనాలను సోషల్ మీడియాలో పోస్టు చేసి, ఉద్దేశపూర్వకంగా అసత్యప్రచారం చేస్తున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఖమ్మం పోలీసుకమిషనర్ సునిల్‌దత్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎఆంధ్రజ్యోతి దినపత్రిక అర్థం వచ్చేలా డేట్‌లైన్ మార్ఫింగ్ చేసి తప్పుడు కథనాన్ని.. ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిందంటూ సోషల్‌మీడియా వేదికగా కొందరు కావాలని ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధుల బృందం ఆ క్లిప్పింగ్‌లను జతరపరుస్తూ గురువారం తనకు ఫిర్యాదు చేశారన్నారు. ఆ ఫిర్యాదు మేరకు ఖమ్మం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నామని తెలిపారు. సైబర్‌క్రైమ్ పోలీసులు త్వరలోనే ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్న వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటారన్నారు. అదేవిధంగా సోషల్‌మీడియా వేదికగా వచ్చే ఇతర తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. పుకార్లు, తప్పుడువార్తకథనాలు సోషల్‌మీడియాలో పోస్టులుపెడితే చట్టపరంగా చర్యలుతీసుకుంటామని సీపీ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

ప్రతిభకు పట్టం కట్టే..
విద్యార్థి విజ్ఞాన్ మంథన్

వచ్చే నెలాఖరు వరకు నమోదుకు అవకాశం

అక్టోబరు 23, 27 తేదీల్లో పరీక్షల నిర్వహణ

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) దేశంలోనే అతిపెద్ద ఆన్‌లైన్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్. ఆరో తరగతి నుంచి 11వ తరగతి (ఇంటర్ మొదటి సంవత్సరం) వరకు విద్యార్థుల్లోని శాస్త్రీయ దృక్పథం ఉన్న ప్రతిభా వంతులను గుర్తించడమే లక్ష్యంగా ఈ పరీక్ష నిర్వహిస్తారు. సైన్స్‌పై విద్యార్థుల్లో ఆసక్తిని కలిగించడం, సైన్స్, టెక్నాలజీ రంగంలో ప్రపంచానికి మన దేశం చేసిన కృషి గురించి అవగాహన కల్పించడానికి వీవీఎం టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్‌ను నిర్వహిస్తారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరిచే విద్యార్థులను గుర్తించి వారిని సత్కరిస్తారు. వారికి దేశంలోని వివిధ ఆర్‌అండ్‌డీ సంస్థల క్షేత్ర పరిశీలనకు అనుమతిస్తారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా స్వయం ప్రతిపత్తి సంస్థ అయిన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం (ఎన్‌సీఎస్ఎం) సహకారంతో విజ్ఞాన భారతి (వీఐబీహెచ్ఏ)లు సంయుక్తంగా వివిధ స్థాయిల్లో ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి భారతదేశ ప్రముఖ పరిశోధనా సంస్థల్లో ఇంటర్న్‌షిప్, అవార్డులు పొందే అవకాశం కల్పిస్తారు.

ఇందుకు ఆసక్తి ఉన్న వారు తమ వివరాలను https:vvm.inregister వెబ్‌సైట్‌లో సెప్టెంబరు 30వ తేదీ వరకు నమోదు చేయవచ్చన్నారు. రూ.200 ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది. వారికి సెప్టెంబరు 1 నుంచి మాక్ టెస్టులు ఉంటాయి. అదే నెల 23, 27 తేదీల్లో ఏదో ఒక రిజిస్ట్రేషన్‌కు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోపు లాగిన్ అయి 90 నిమిషాల వ్యవధిలో పరీక్ష రాయాలి. లాగిన్‌కు ఒక్కసారి మాత్రమే అవకాశం ఉంటుంది. నవంబరు 15న ఫలితాలను ప్రకటిస్తారు. ఎంపికైన విద్యార్థులకి డిసెంబరు 8 నుంచి 15 వరకు రాష్ట్రస్థాయి శిబిరం, డిసెంబరు 22న మరో రెండు రోజుల శిబిరం ఉంటుంది. 2026 మే 17, 18 తేదీల్లో జాతీయస్థాయి శిబిరాన్ని నిర్వహిస్తారు. ఇక పాఠశాల స్థాయి ప్రధాన పరీక్ష అక్టోబరు 28 నుంచి 30 వరకు ఉంటుండగా ఉత్తీర్ణులైన వారికి రెండో స్థాయి పరీక్ష ఆన్‌లైన్‌లో ప్రొక్టరింగ్ విధానం ద్వారా పరిశీలికుల సమక్షంలో నవంబరు 19న ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. లెవెల్-1 ప్రధాన పరీక్షలో ప్రతి తరగతికి సంబంధించిన 100 ప్రశ్నలు ఉంటాయి.



సెక్షన్-ఏలో విజ్ఞానశాస్త్ర రంగంలో మేధావుల కృషి, సత్యేంద్రనాథ్ బోస్ జీవిత చరిత్ర, సెక్షన్-బీలో 6 నుంచి 11 తరగతులకు సంబంధించి భారతీయులు, విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులు ఉంటాయి.

రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక ఇలా..

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో ప్రతిభ చూపిన మొదటి 25 మందిని ఎంపిక చేస్తారు. 6 నుంచి 11 తరగతులకు గాను మొత్తం 150 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందిని జాతీయస్థాయి కి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతీ తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలతో పాటు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల చొప్పున 18 మంది జాతీయ స్థాయి విజేతలుగా నిలుస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతిగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రంతో పాటు ఏడాది పాటు నెలకు రూ.2వేల చొప్పున భాస్కరా ఉపకార వేతనం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2025-26లో జాతీయ, జోనల్‌స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులు డీఆర్డీవో, ఇస్రో, సీఎస్ ఐఆర్, బీఏ ఆర్సీ మొదలైన ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో ఒకటి నుంచి 3వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

విద్యార్థులకు సువర్ణావకాశం

పెసర ప్రభాకర్ రెడ్డి, ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్

సైన్స్‌లో ఆసక్తి ఉన్న విద్యార్థులకు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ సువర్ణవకాశం. వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు, పరిశోధన, ప్రయోగాల్లో వారు రాణించేలా ఉపయోగపడుతుంది. జాతీయ స్థాయిలో పరీక్షకు ఎంపికైతే ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్ నెలకు రెండు వేలు, తరగతి చొప్పున ఏడాదికి రూ.24వేల ఉపకార వేతనం ఉంటుంది. 6వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు అవకాశం ఉంది. ఈ పరీక్షను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు రాయవచ్చు. పోటీతత్వాన్ని పెంచుకునేందుకు ఈ పరీక్ష దోహదపడుతుంది.

ఈఎంఆర్ఐ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు

ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం అధికారి శివకుమార్

ఖమ్మం కలెక్టరేట్/చుంచుపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఈఎంఆర్ఐ (ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ సెంటర్) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సర్వీసెస్ ఫౌండేషన్‌లో ఎమర్జన్సీ మెడికల్ టెక్నీషియన్ (108 ఈఎంటీ), 102 (అమ్మఒడి) కెప్టెన్ (డ్రైవర్) ఉద్యోగాల కోసం ఆసక్తి కలిగిన పురుష అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తోన్నట్లు ఉమ్మడి ఖమ్మంజిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ధ్రువ పత్రాలతో ఇంటర్వ్యూకి హాజరు కావాలని కోరారు. ఈఎంటీకి కావలసిన విద్యార్హతలు బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, బీఎస్సీ ఎంఎల్‌టీ, బీఫార్మసీ ఏదైనా ఒకటి ఉండాలన్నారు. తెలంగాణలో ఎక్కడైనా పని చేయాల్సి ఉంటుందన్నారు. డ్రైవర్లకి కావలసిన అర్హతలు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి, ఎత్తు 5'4 అంగుళాలు, వయసు 22 నుండి 35 సంత్సరాలు, ఎల్ఎంవీ బ్యాడ్జీ కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ పై కనీసం 3 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. ఖమ్మంజిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈనెల 25వ తేదీ ఉదయం 10గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర సమాచారం కోసం 9010251025, 9154918117, 9989458588 నెంబర్లలో సంప్రదించాలని మేనేజర్ శివకుమార్ ప్రకటనలో కోరారు.

ఎన్నార్‌ఈజీఎస్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ కృష్ణన్

నేలకొండపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ కృష్ణన్ కోరారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మూటాపురంలో ఎన్నార్‌ఈజీఎస్ కింద పూర్తి చేసిన పనులను కృష్ణన్ ఎంపీడీఓ మర్రి ఎర్రయ్యతో కలిసి పరిశీలించారు. ఎన్నార్‌ఈజీఎస్ కింద గ్రామంలో నిర్మించిన పశువుల షెడ్లను పరిశీలించారు. బహుదొడ్డి సామ్రాజ్యం నిర్మించిన క్యాటిల్ షెడ్‌ను ఎంపీడీఓతో కలిసి ప్రారంభించారు. లబ్ధిదారుడితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పశువులను షెడ్‌లో కట్టేయటం వలన బురద లేకుండా ఉండటంతో, దోమలుండటం లేదని, దీంతో పాల దిగుబడి పెరిగిందని సామ్రాజ్యం అధికారులకు తెలిపారు. అనంతరం కృష్ణన్ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 6 క్యాటిల్ షెడ్లను మంజూరు చేసినట్లు అధికారులు చెప్పారన్నారు. క్యాటిల్ షెడ్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేసుకున్న లబ్ధిదారులను కృష్ణన్ అభినందించారు. కార్యక్రమంలో సీడీసీ డైరెక్టర్ గుడిపాటి మధు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు, సొసైటీ డైరెక్టర్ బొల్లినేని వెంకన్న, కట్టా రాజేష్, ఎంపీఓ శివ, ఏపీఓ సునీత, టీఏ శేషగిరి, పంచాయతీ కార్యదర్శి స్వరూపారెడ్డి, ఆశాలు, అంగన్వాడీలు, గ్రామ దీపికలు పాల్గొన్నారు.

గొల్లపూడి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

వైరా, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపూడి గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శి కోట సునీతను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం సస్పెండ్ చేశారు. ఈ పంచాయతీ స్పెషలాఫీసర్ కృష్ణ చైతన్యకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. గొల్లపూడి పంచాయతీలో ఎన్ఆర్‌ఈజీఎస్ పనులకు సంబంధించి ఆ ఖాతాలో జమయిన రూ.ఏడు లక్షలను డ్రాచేసి పంచాయతీ జనరల్ ఫండ్ ఖాతాలో జమచేయాల్సిన సునీత ఆ మొత్తాన్ని తన సొంత అవసరాలకు వాడుకున్నారు. దాదాపు ఐదునెలల క్రితం జరిగిన ఈ సంఘటన డీఎల్‌పీవో రాంబాబు విచారణలో తేలింది. అప్పటి అధికారుల వత్తిళ్ల మేరకు తాను వాడుకున్న రూ.ఏడు లక్షల్లో రూ.ఐదు లక్షల వరకు పంచాయతీ ఖాతాలో జమచేసింది ఇంకా రూ.రెండు లక్షల నిధులను జమచేయలేదు. దాంతో తమకు అందిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేసి కలెక్టర్‌కు నివేదించారు. ఆ నివేదిక మేరకు సునీతను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

మూతపడిన పాఠశాలను ప్రారంభించిన అధికారులు



బోజ్యాతండాలో పునఃప్రారంభించిన పాఠశాల

పాల్వంచ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోజ్యాతండాలో బడి ఈడు పిల్లలు లేక గత నాలుగు ఏళ్ల నుంచి తాత్కాలికంగా మూతపడి ఉంది. ఈ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్ జిల్లా పర్యాటన సందర్భంగా మూతపడిన పాఠశాలలు తిరిగి తెరవాలని ఆదేశాలు జారీచేశారు. గ్రామం లో సర్వేచేసి బడిఈడు కలిగిన పిల్లలను గుర్తించారు. పై అధికారుల ఆదేశాలనుసారం ఎంఈవో శ్రీరామ్మూర్తి పునఃప్రారంభోత్సవం చేశారు. ఈ సం దర్భంగా ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించే విధంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ముందుకు రావాలన్నారు. ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలలోనే నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో బోధించే ఉపాధ్యాయులను సద్వినియోగం చేసుకుని పిల్లల్లో విద్యాభివృద్ధిని పెంపొందించాలని పిలుపునిచ్చారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ధర్మసోత్ ఉపేందర్, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పాఠశాల పునఃప్రారంభంకు కృషి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎ.శ్రీరామ్మూర్తి, గీతాకుమారి, ఎం.వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాస్, భిక్షం, రాజులు, సీఆర్పీ శ్రీనివాస్‌రావు, గ్రామస్తులు నూనావత్ బాబు, రాంబాబు, రాము, అంగోత్ లచ్చు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ మీకిదే...కుసుమాంజలి..

లక్ష్మీతాయారు అమ్మవారికి పది రకాల పుష్పాలతో పూజలు

20 కిలోల పూలు వినియోగం



అమ్మవారికి సహస్రనామర్చన నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గులాబీలు.. చామంతులు.. విరజాజులు.. సన్నజాజులు.... కనకాంబరాలు, మల్లెలు ఇలా వివిధ రకాల పుష్పాలతో అధినాయకగా పేరొందిన లక్ష్మీతాయారు అమ్మవారిని వైదిక సిబ్బంది భక్తిప్రపత్తులతో కొలిచారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఒక వైపు వేద పండితుల మంత్రోచ్చారణలు..... అర్చకస్వాముల ఉపచారాలతో రామాలయ ప్రాంగణంలోని నిత్య కల్యాణ మండపం వేదిక శ్రావణశోభలతో వెలుగొందింది. లక్ష్మీదేవికి అత్యంత ప్రీతికరమైన వారం శుక్రవారం. శ్రావణమాసం ఆఖరి శుక్రవారం కావడంతో అమ్మవారిని అర్చించడం వలన విశేష ఫలితాలను పొందవచ్చునని ధర్మశాస్త్రం చెబుతుంది. దీంతో భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి కొలువుదీరిన చోట లక్ష్మీతాయారు అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పుష్పార్చన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులను, మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో నిత్య కల్యాణ మండప వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఎటువంటి విఘ్నాలు కలుగకుండా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర శతనామార్చన, సహస్రనామార్చన నిర్వహించారు. ఈ సమయంలో ప్రత్యేకంగా తెప్పించిన 10 రకాలైన 20 కేజీల పుష్పాలతో ఈ పూజా కార్యక్రమాన్ని ఆద్యంతం ఎంతో భక్తి భావనతో నిర్వహించారు. మల్లెలు, గులాబీలు, విరజాజులు, చామంతులు తదితర పూలతో అమ్మవారి పుష్పార్చనను నిర్వహించారు. శ్రావణమాసంలో అమ్మవారిని పుష్పాలతో అర్చించడం విశేష ఫలప్రదం. మల్లెలు, తులసి, గులాబీలు, కనకాంబరాలు, విరజాజులు తదితర పుష్పాలతో అర్చించడం వలన ఒక్కొక్క పుష్పానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. ఆ పుష్పంతో అర్చించడం వలన ఆ ఫలితాలు పొందవచ్చు అని ఆగమం చెబుతోంది. అలా పద్మాలయ అమ్మవారి నివాసమే పద్మం. ఇలా వివిధ పుష్పాలు సహస్రనామార్చనతో వంద వంద నామాలకు ఒక్కొక్క పుష్పాలతో అర్చనను నిర్వహించారు. పుష్పార్చన జరుగుతున్న సమయంలో ప్రత్యేక హారతులు అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంకు భారీగా మహిళలు తరలివచ్చి తిలకించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇవో ఎల్ రమాదేవి, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం కావడంతో స్వామి వారి మూలవరులను స్వర్ణ కవచంతో అలంకరించారు.

ప్లాంటేషన్‌ను ధ్వంసం చేసిన వారికి రిమాండ్

దుమ్ముగూడెం ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం అటవీ రేంజ్ పరిధి పెదముడిసీలేరు రిజర్వ్‌ఫారెస్ట్ దేవరపల్లి బీట్‌లో పలుమార్లు అటవీ శాఖ ప్లాంటేషన్లను ధ్వంసం చేసిన చర్ల మండలం మామిడిగూడెంకు చెందిన ఏడుగురు మహిళలపై కేసుల నమోదుచేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు రేంజ్ అధికారి కమల శుక్రవారం తెలిపారు. 2025 ఆగస్టు నెలలో హరితవనం పెంపకంలో భాగంగా నాటిన రూ.10లక్షల విలువగల 12 వేల మొక్కలతో పాటు, నర్సరీలోని రూ.20వేల విలువైన 3 వేల మొక్కలకు కూడా నష్టం చేశారు. వీరు 2021లో నాటిన రూ.5.45 లక్షల విలువగల మొక్కలను కూడా ధ్వంసం చేశారు. పోడుపేరిట అడవులను ధ్వంసం చేస్తున్న వీరిలో ఎవరికీ ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు లేవన్నారు. సర్వేకు వెళ్లిన అధికారులను సైతం అడ్డుకున్నారని తెలిపారు. ప్రభుత్వ, అటవీశాఖ వ్యతిరేక పనులకు పాల్పడిన వారు ఎవరైనా చట్టరీత్యా శిక్షార్హులని తెలిపారు.

హెల్మెట్ ధరించని వారి దిచక్రవాహనాలు సీజ్

తల్లాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో శుక్రవారం హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారుల నుంచి 55 బైకులను పోలీసులు సీజ్ చేశారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో హెల్మెట్ ధరించని వాహదారుల బైక్‌లు సీజ్ చేసి వారిపై కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

వివాహేతర సంబంధం అంటూ ప్రచారంతో మనస్తాపం



సుధీర్ (ఫైల్)

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఓ వివాహితతో అక్రమ సంబంధం ఉందంటూ కొందరు అసత్య ప్రచారం చేయడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని బంగారుచెలక గ్రామ పంచాయతీ మాలగూడెంకు చెందిన కోడిరెక్కల సుధీర్ (24)కు గ్రామంలోని ఓ వివాహితతో అక్రమ సంబంధం ఉందంటూ ముగ్గురు వ్యక్తులు అసత్య ప్రచారం చేస్తూ బెదిరింపులకు పాల్పడుతుండంతో వారి పేర్లను సుధీర్ సూసైట్‌నోట్‌లో వెల్లడించారు. ఈ విషయం తన ఇంట్లో కుటుంబసభ్యులకు తెలిస్తే అందరు బాధపడతారని భావించి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నాడు. ఈ విషయమై మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు వాహనాల ఢీ.. ముగ్గురికి గాయాలు

జూలూరుపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనటంతో ముగ్గురికి గాయాలైన ఘటన శుక్రవారం మండలంలోని గుండెపూడి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. మండలంలోని రాంచంద్రాపురం గ్రామానికి చెందిన పూనెం వంశీ, ముక్తి శ్రీనులు ద్విచక్ర వాహనంపై రాంచంద్రాపురం నుంచి జూలూరుపాడు వైపు వస్తున్నారు. ఈ క్రమంలో గుండెపూడి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో వీరి ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ సంఘటనలో వంశీ, శ్రీనులతోపాటు గుండెపూడి గ్రామానికి చెందిన తేజావత్ వెంకటేష్‌లకు గాయాలయ్యాయి. వైద్య చికిత్స నిమిత్తం ముగ్గురిని జూలూరుపాడులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వంశీకి మెరుగైన వైద్య చికిత్స కొరకు ప్రైవేట్ వాహనంలో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

గోవులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

వైరా, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా చేస్తున్న ఎనిమిది గోవులను ఖమ్మం జిల్లా వైరా పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం వైరా ఎస్ఐ పి.రామారావు, ట్రెయినీ ఎస్ఐ పవన్‌కుమార్ తమ సిబ్బందితో జాతీయ ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు మినీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది గోవులు కన్పించాయి. దాంతో వ్యాన్ సహా గోవులను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న గోవులను ఖమ్మంలోని టేకులపల్లి గోశాలకు తరలించారు.

శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రులు జరుపుకోవాలి

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : ఖమ్మం సీపీ సునీల్‌దత్



ఖమ్మంక్రైం, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రుల ఉత్సవాలు జరుపుకోవాలని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో గణేష్ మండపాల నిర్వాహణ కోసం పోలీసుశాఖ రూపొందించిన పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు అనేది కేవలం మండపం నిర్వాహణ, మండపంనకు సంబంధించిన సమాచారం కొరకు మాత్రమేనని, ఈ సమాచారం ద్వారా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులువుగా ఉంటుందన్నారు. పోలీసుశాఖ ఆన్‌లైన్ ద్వారానే అనుమతి మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆ తర్వాతనే వినాయక మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

మండపాల నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలు

- గణేష్ మండపం నిర్వాహణకోసం పోలీసుశాఖ రూపొందించిన htpp//policeportel, tspolice.gov.in పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలన్నారు.
- విగ్రహం ఏర్పాటుల స్థలం, ప్రైవేటు వ్యక్తికి చెందినదయితే సబందిత వ్యక్తుల నుండి ఎటువంటి అభ్యంతరం లేదని ధృవీకరణ పత్రం పొందాలి
- మండపాల నిర్వాహణకు అవసరమైన విద్యుత్‌కోసం విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి
- తప్పనిసరిగా సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలి.
- మండపాల నిర్వాహకులు, కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్ల ను మండపంలో ఏర్పాటుచేయాలి
- సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి పది గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి.
- మండపాల్లో శోభాయాత్ర సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లోను డీజేను ఏర్పాటుచేయరాదు
- మండపాల వద్ద వెలిగించే దీపాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఎప్పుడైనా అగ్నిప్రమాదం జరిగినప్పుడు ముందు జాగ్రత్తలో భాగంగా దగ్గరలో రెండు బకెట్లు ఇసుక, నీళ్లు ఏర్పాటు చేసుకోవాలి
- మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడడం, అసభ్యకర నృత్యాలు ఏర్పాటు, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు, పాటలుపాడడంపై నిషేధం
- సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి పుకార్లు, వదంతులను నమ్మకూడదు అని ఎవరికైనా ఎలాంటి సందేహాలు, ఉన్న సంబంధిత పోలీసుశాఖకి లేదా డయల్100కు సమాచారం అందించాలి.
- మునిసిపల్, పోలీసుశాఖ నిర్దేశించిన ప్రాంతాలలో విగ్రహాలు నిమజ్జనం చేయాలి

ఒడిసా టు రాజస్థాన్..

లారీలో తరలిస్తున్న 425 కిలోల గంజాయి స్వాధీనం

సరుకు విలువ రూ.2.12 కోట్లు

ఇద్దరు నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడించిన ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఒడిసా రాష్ట్రం మోటు అటవీ ప్రాంతం నుంచి ఓ లారీలో రాజస్థాన్‌కు తరలిస్తున్న రూ.2,12,47,500 విలువైన 424.95 కిలోల గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీసీఎస్, టేకులపల్లి పోలీసులు గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. దీనికి సంబంధించి వివరాలను శుక్రవారం టేకులపల్లి పోలీసుసర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను వెల్లడించారు. ఇల్లెందు డీఎస్పీ ఆధ్వర్యంలో టేకులపల్లి ఎస్సై రాజేందర్, సీసీఎస్ సీఐ రామాకాంత్, ఎస్సై ప్రవీణ్, పోలీసు, సీసీఎస్ సిబ్బంది కలిసి ఇల్లెందు-కొత్తగూడెం ప్రధాన రహదారిలో టేకులపల్లి మండలం వెంకటియాతండా వద్ద గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిసా మోటు అటవీప్రాంతం నుంచి భద్రాచలం, పాల్వంచ మీదుగా రాజస్థాన్‌కు వెళ్తుతున్న ఓ లారీని ఆపి తనిఖీ చేయగా క్యాబిన్‌లో గంజాయి ప్యాకెట్లు లభించాయి. రాజస్థాన్ రాష్ట్రం బిల్వారా జిల్లా హద్వకబడియా గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ప్రభులాల్ గుర్జర్, తాల్‌కుర్ద్‌కు చెందిన మరో లారీడ్రైవర్ శివరాజ్ గుర్జర్‌లను అదుపులోకి తీసుకొని పోలీసులు ఆ గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. మోటు ప్రాంతంలో గంజాయి ఉందని, దానిని లోడు చేసుకొని వస్తే రూ.2లక్షలు ఇస్తానని లారీడ్రైవర్ ప్రభులాల్ గుర్జర్‌కు.. రాజస్థాన్ రాష్ట్రం బిల్వార జిల్లా నేగ్డియా గ్రామానికి చెందిన నారాయణ గుర్జర్ ఆశచూపడంతో ఆ లారీడ్రైవర్ అంగీకరించినట్లు తెలిపారు. గంజాయి తరలింపునకు సహకరించాలని, అందుకు రూ.20 వేలు ఇస్తానని ప్రభులాల్ గుర్జర్.. మరో డైవర్ శివరాజ్ గుర్జర్‌కు ఆశచూపడంతో అతడు కూడా అంగీకరించడంతో.. గంజాయిని తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడిన గంజాయిని మోటు అటవీ ప్రాంతంలో ఒడిస్సా కలిమెలకు చెందిన రాంబాబు లారీలో లోడుచేయించగా.. దాన్ని తరలిస్తుండగా ఇద్దరు డ్రైవర్లు పట్టుబడ్డారు. ఈ మేరకు లారీ, రెండు సెల్‌ఫోన్లను పోలీ సులు సీజ్‌చేశారు. గంజాయిని పట్టుకొ న్న టేకులపల్లి ఎస్సై రాజేందర్, సీసీ ఎస్ సీఐ రమాకాంత్, ఎస్సై ప్రవీణ్, పోలీసు, సీసీఎస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి, బోడు ఎస్సైలు రాజేందర్, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్‌పే చేస్తే క్యాష్ ఇస్తానని బురిడీ

డబ్బులు ఇవ్వకుండా పరారైన దుండగుడు

కారేపల్లి క్రాస్‌రోడ్డులోని పెట్రోల్‌బంకులో ఘటన

కారేపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తన ఖాతాలోకి డబ్బు అవసరం ఉందని తన వద్ద క్యాష్ ఉందని రూ.60వేలు ఫోన్‌పే చేయించుకుని పరారైన ఉదంతమిది. ఈ ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం కారేపల్లి క్రాస్‌రోడ్డులోని ఓ పెట్రోల్ బంకులో బుధవారం జరిగింది. రెండ్రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆసల్యంగా వెలుగులోకి వచ్చింది. బంకులో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్న తురక మహేష్ అనే వ్యక్తి దగ్గరకు బుధవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తనకు రూ.70వేలు అవస రం ఉందని, తనకు ఫోన్‌పే చేస్తే క్యాష్‌ఇస్తానని నమ్మబలికాడు. అయి తే మహేష్ తన ఖాతాలో అంతక్యాష్ లేదని చెప్పాడు. అంతటితో ఆగ కుండా తన మిత్రుడికి కాల్ చేసి రూ.40వేలు, తెలిసిన మరోవ్యక్తి నుంచి రూ.20వేలు గుర్తుతెలియని వ్యక్తికి ఫోన్‌పే చేయించాడు. తీరా ఫోన్‌పే చేయించుకున్న తర్వాత సదరు వ్యక్తి కారేపల్లి నుంచి తన మేడం డబ్బు పంపుతున్నారని, కొంతసేపు ఆగాలని చెప్పి బంకులోనే కుర్చున్నాడు. ఎంత సేపటికీ ఎవరూ డబ్బులు తీసుకు రాకపోవడంతో మహేష్ అతడిని ప్రశ్నించాడు. దాంతో 'మా మేడం నిన్ను తీసుకుని కారేపల్లి రమ్మన్నారు. అక్కడే క్యాష్ ఇస్తానన్నారు' అని చెప్పాడు. అది కూడా నిజమేనని నమ్మిన మహేష్ ఆ వ్యక్తితో కారేపల్లి వెళ్లాడు. అతడు తీసుకెళ్లిన ప్రాంతానికి ఎవరూ రాలేదు. దాంతో సదరు వ్యక్తి.. ఫోన్‌లో మాట్లాడానన్నట్లు చెప్పి.. ఇల్లెందు రమ్మన్నారనిచెప్పి.. మహేష్ ను బైకుపై ఎక్కించుకుని ఇల్లెందులోని కరెంట్ ఆఫీస్‌కు తీసుకెళ్లాడు. తొలుత ఇద్దరూ లోపలికి వెళ్లాక.. గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ మాట్లాడుతూ బయటకు వచ్చి నెంబరుప్లేటులేని స్కూటర్‌పై పరారై.. ఫోన్ స్విచ్‌ఆఫ్‌చేశాడు. దాంతో తాను మోసపోయానని గుర్తించిన మహేష్ తిరిగి బంకుకు వచ్చి తన యజమానికి చెప్పాడు. ఈ విషయంపై వారు అదేరోజు కారేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు విచారణ ప్రారంభించారు. అయితే ఈ విషయం ఆనోటా ఈనోటా పడి శుక్రవారం వెలుగులోకి వచ్చింది.

చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

ఖమ్మంలీగల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బాలబాలికలు చట్టాల పట్ల అవగాహన కలిగిఉండి గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ,సీనియర్ సివిల్‌జడ్జి కెవి చంద్రశేఖరరావు పేర్కొన్నారు. శుక్రవారం సింగరేణి మండలంలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు లైంగిక నేరాలు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం పోక్సో చట్టాన్ని రూపొందించిందని, పిల్లలపై జరిగే లైంగిక నేరాలపై కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు అమలు చేయవచ్చనీ అన్నారు. పిల్లలను శారీరకంగా, మానసికంగా వేధించినా కూడా ఈ చట్టం కింద కేసు నమోదు చేస్తారని న్యాయాధికారి చంద్రశేఖరరావు వివరించారు.

ఘనంగా శ్రావణ చివరి శుక్రవారం పూజలు




రామకృష్ణ విద్యాలయంలో సామూహిక కుంకుమపూజ, గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరి శుక్రవారం కావటంతో జిల్లాలోని పలు ఆలయాలలో శ్రావణ శుక్రవార పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, కుంకమ పూజలు నిర్వహించారు. నగరంలోని గుటుమల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. నగరంలోని సారధినగర్ శివాలయంలో మహా శ్రీచక్రార్చన, శ్రీచక్ర హోమం నిర్వహించి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. రామకృష్ణ విద్యాలయంలో సామూహిక కుంకుమపూజ, వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఖానాపురం పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీవిశాలక్ష్మీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి విశేషపూజలు, అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. టేకులపల్లి గోశాలలో వెంకటేశ్వరస్వామికి సహస్రనామపూజ, వెంకటేశ్వరస్వామి వ్రతాలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి టీటీ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ఖమ్మంస్పోర్ట్స్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు.అన్నివిభాగాల్లో విజయ పరంపర కొనసాగించి క్రీడాకారులు పతకాలు కొల్లగొట్టారు. శాట్స్ మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలాదేవి, రాష్ట్రటేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్వరి, నాగేందర్ రెడ్డి క్రీడాకారులు ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు. మీ ప్రతిభ రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బాలసాని విజయ్, ఓలేటి సాంబమూర్తి, మజహర్, పరిటాల చలపతి, రెడ్డిసాయి శివ తదితరులు ఉన్నారు.

వార్డు ఆఫీసర్ల పనితీరుపై కమిషనర్ సమీక్ష

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో కీలకంగా బాధ్యతలు నిర్వహిస్తున్న వార్డు ఆఫీసర్లు పనితీరుపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సమీక్ష నిర్వహించారు. ఖమ్మంలో 35మంది వరకు వార్డు ఆఫీసర్లు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా శుక్రవారం కమిషనర్ తన ఛాంబర్‌కు ప్రతీ ఐదుగురు వార్డు సభ్యుల చొప్పున పిలిపించారు. ప్రతీ ఒక్కరితో విడివిడిగా కమిషనర్ మాట్లాడారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. ఖమ్మం నగరంలో జరుగుతున్న పారిశుధ్యం నుంచి ఇందిరమ్మ ఇళ్ల వరకు రివ్యూ చేపట్టారు. వార్డుఆఫీసర్లు విధులు, బాధ్యతలతో పాటుగా క్షేత్రస్థాయిలో వారు



వార్డు ఆఫీసర్‌తో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఎదుర్కొంటున్న రాజకీయ, ఇతర సమస్యలను కమిషనర్ తెలుసుకోవటంతో వార్డు ఆఫీసర్లు హర్షం వ్యక్తం చేశారు.

నష్టం మిగిల్చిన ముసురు

» వరదల్లో పాడైన పంటలు
» కూసుమంచి మండలంలో సుమారు 800 ఎకరాల్లో నష్టం
» ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు
» కోతకు గురైన పలు రహదారులు

కూసుమంచి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల ముసురు కారణంగా రైతన్నలకు నష్టం మిగిల్చింది. వర్షాలకు పోటెత్తిన వరద కారణంగా పంటలు పాడైపోయాయి. జిల్లాలోనే అత్యధికంగా వర్షపాతం నమోదైన మండలాల్లో కూసుమంచి ఒకటి... వరుణుడు కరుణించడంతో వారం వ్యవధిలోనే చెరువులు, కుంటలన్నీ కళకళలాడుతున్నాయి. చెరువులన్నీ మత్తడి దుంకుతుండటంతో వరదనీటిలో మునిగిన పొలాలు ఇక పనికిరాకుండా పోతాయేమోనని వాపోతున్నారు. వరి, పత్తి పెసర పంటలు చాలా గ్రామాల్లో నీటమునిగింది. జీళ్ల చెరువు, కూసుమంచి, నర్సింహులగూడెం, కొత్తూరు, తుర్కగూడెం, కిష్టాపురం, జక్కేపల్లి, లాల్‌సింగ్‌తండ, మండడి నర్సయ్యగూడెం, తదితరగ్రామాల్లో పంటమునిగింది. ముఖ్యంగా వాగులు, చెరువులు పక్కనున్న పొలాల్లో, చేలల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ పరీవాహ ప్రాంతాల్లోని పంటలు వదులుకోవాల్సిందేనని రైతులు చెబుతున్నారు. వరి కర్రలు 48గంటలు మించి మునిగి ఉంటే పైరంతా చనిపోతుందని వాపోయారు. మండలంలో సుమారు 800 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని ప్రాథమిక అంచనా. రైతుల విజ్ఞప్తి మేరకు వ్యవసాయ శాఖ అధికారులు పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తున్నారు.

రాకపోకలకు అంతరాయం

భారీ వర్షాల కారణంగా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. నర్సింహలగూడెం నుంచి కొత్తూరు, కిష్టాపురం, జీళ్లచెరువు నుంచి చేగొమ్మ, తాళ్లచెరువు గ్రామాల మధ్య వాగులు పొంగి ప్రవహించాయి. ఆప్రాంతంలోని రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. లోలెవల్ చప్టాలు ఉండడం వలన ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైన అధికారులు హైలెవల్ వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉంది.



చౌటపల్లి వద్ద ఇసుకమేట వేసిన వరిపొలం



జీళ్లచెరువు-చేగొమ్మ మధ్య కోతకు గురైన రోడ్డు

ప్రతీ హామీని నెరవేరుస్తున్నాం: రాయల

తిరుమలాయపాలెం,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని, ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని దమ్మాయిగూడెంలో రాయల నాగేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా వాటిని అధిగమించి అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమథకాలు అందిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్నివర్గాల వారికి అన్యాయం జరిగిందన్నారు. గిడ్డంగుల విస్తరణ కంటే పథకాల అమలుపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతుందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నం రాజశేఖర్, గుగులోత్ మోహన్ పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రజాప్రభుత్వ లక్ష్యం

» ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య
» అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కామేపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జగన్నాథతండ, కొత్తలింగాలలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనుల జాతరలో భాగంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రజలకు మౌళిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తారన్నారు. పశువుల పాకలు, కంపోస్టు గుంతలు, కోళ్లఫారాల నిర్మాణం, పొలంబాటలు, నర్సరీల పెంపకం, ఊటకుంటల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు హన్మంతరావు, పీ.వీరభద్రం, గబ్రూ, బావ్‌సింగ్, డీఎస్, ఏపూరి మహేందర్, జగన్నాథరెడ్డి, మాజీ ఎంపీపీ సునీతరాందాస్, దీనూ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



షెడ్ వివరాలను అడుగుతున్న ఎమ్మెల్యే

ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి

పీడీ నళినీ పద్మావతికి వినతి



పీడీ నళినీ పద్మావతికి పూలమొక్కను అందిస్తున్న ఆర్పీలు

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ఎన్నోఏళ్లుగా పట్టణ పేదరిక నిర్మూలనకు రాత్రింబవళ్లు కష్టపడుతున్న రిసోర్స్ పర్సన్(ఆర్పీ)ల సమస్యలు పరిష్కరించాలని ఆర్పీల సంఘం ఆధ్వర్యంలో నూతన మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నళినీపద్మావతిని కోరారు. శుక్రవారం ఆర్పీల సంఘం నాయకులు కేఎంసీ కార్యాలయంలో పీడిని కలిసి పూలమొక్కను అందించారు. తాము క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కనీస గౌరవ వేతనం అమలు చేయాలని ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు షబానా అంజు, కార్యదర్శి పద్మ, కోశాధికారి మొగిలమ్మ, సహాయ కార్యదర్శి లక్ష్మీకుమారి, ఉపాధ్యక్షురాలు రమాదేవి నాయకులు విజయ, శోభ, గోపీకుమారి, విజయ, అనురాధ, కనకదుర్గ పాల్గొన్నారు.

కేఎంసీ కమిషనర్‌ను కలిసిన మెప్మా పీడీ

కేఎంసీ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్యను మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నళినిపద్మావతి మర్యాద పూర్వకంగా కలిశారు. కొద్దిసేపు కమిషనర్‌తో మాట్లాడారు. డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి వెంటున్నారు.

ఖాళీ స్థలాలకు జరిమానాలపై చర్చ

గతంలో రూ.5వేలు, వర్షాల వేళ రూ.2వేలే!



జరిమానా విధిస్తున్న అధికారి

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఖాళీస్థలం యజమానులకు విధించిన జరిమానాపై కేఎంసీలో చర్చ జరుగుతోంది. ఖాళీస్థలంలో పిచ్చిమొక్కలు ఉండి వాటిని తొలగించకపోతే ఆస్థలం యజమానికి రూ.25వేలు జరిమానా విధిస్తామని కేఎంసీ ఆధ్వర్యంలో ఖాళీ స్థలాల్లో నోటీసు బోర్డులు పెట్టారు. సాధారణ సమయంలోను కనీసం రూ5వేల నుంచి రూ.25వేల వరకు జరిమానా విధిస్తారు. అయితే వర్షాకాలంలో ఖమ్మం నగరంలో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, వర్షపు నీటి నిల్వలు పెద్ద సమస్యగా మారాయి. సీజనల్ వ్యాధులు, దోమల పెంపక కేంద్రాలుగా మారాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ సమయంలో మరింత కఠినంగా జరిమానా విధించాల్సిన పారిశుధ్య అధికారులు ఓ ప్లాట్ యజమానికి కేవలం రూ.2వేలు మాత్రమే ఫైన్ వేయటం కేఎంసీలో చర్చ జరుగుతుంది.ఇటీవల పారిశుధ్య జరిమానాల్లో మతలబులు చోటు చేసుకుంటున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లబ్ధిదారుల ఆమోదంతోనే పాడిపశువులు కొనుగోలు చేయాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల ఆమోదంతోనే పాడి పశువులను కొనుగోలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో ఆమె శుక్రవారం పాడిపశువుల కొనుగోలుపై అధికారులతో సమీక్షించారు. ఇందిరా మహిళా డెయిరీ గ్రౌండింగ్‌లో భాగంగా ప్రస్తుతం మొదటి విడతలో 125 సభ్యులకు 2 పశువులు చొప్పున పాడి పశువులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పశువుల కొనుగోలుకు కొనుగోలు కమిటీ లబ్ధిదారులతో కలిసి వెళ్లాలన్నారు. జిల్లాలో ఉన్న వాతావరణానికి అలవాటు పడే పశువులను కొనుగోలు చేయాలని, పశువులు కొనుగోలులో నిర్దేశిత నిబంధనలను పాటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కే.నవీన్‌బాబు, సోషల్‌వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

పీఎంశ్రీ నిధులపై సమీక్ష

జిల్లాలో పీఎంశ్రీ పాఠశాలలకు కేటాయించిన నిధులు సమర్థంగా వినియోగించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆమె శుక్రవారం పాఠశాలలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలోనీ పీఎంశ్రీ పాఠశాలల్లో మౌళిక వసతుల ఏర్పాటు, పాఠశాల నిర్వహణ గ్రాంట్ క్రింద మంజూరు చేసిన నిధులను వినియోగించిన తీరు వివరాలను అందించాలన్నారు. యూత్, ఎకోక్లబ్ నిధులను జాగ్రత్తగా వినియోగించాలన్నారు.పాఠశాల నిర్వహణ గ్రాంట్ నుంచి చిన్న, చిన్నమరవ పనులు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు హార్వెస్ట్ విద్యార్థిని

ఖమ్మంస్పోర్ట్స్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): పూణేలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-15 జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని జీడీ.హన్సిక ఎంపికైందని పాఠశాల యజమాన్యం తెలిపింది. ఈనెల18,19 తేదీల్లో ఇబ్రహీంపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైందని తెలిపారు.ఆమెను పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి అభినందించారు.



అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తుమ్మల యుగంధర్

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హత కలిగిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు జరుగుతాయని కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపుకార్యాలయంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులకు పట్టాలను అందించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.



ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అభిమానులు నిర్వహించారు. రక్తదానాలు, అన్నదానాలు నిర్వహించి కేక్ కోసి అభిమానుల సమక్షంలో పేదలకు పంచిపెట్టారు. నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరంలో చిరంజీవి అభిమానులు అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. జిల్లా చిరంజీవి ఫ్యాన్స్ అసోషియేషన్ అధ్యక్షుడు గుండాల, వీరేష్ గౌడ్, గంగిశెట్టి శ్రీనివాస్, పలువురు మెగా అభిమానులు రక్తదానం చేశారు. ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి సందీప్ కుమార్ రక్తదానంచేసిన వారికి ప్రశంశా పత్రాలు అందించారు. నగరంలోని పలు అనాథ ఆశ్రమాలలో పేదలకు పండ్లు, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు ఉపేందర్, లక్ష్మణ్‌గౌడ్, అంజి రక్తదానం చేశారు.



డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలి

ఖమ్మంరూరల్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటి పరిధిలోని రాజీవ్ గృహకల్ప వాసులకు డబల్‌బెడ్‌రూమ్ ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాజీవ్ గృహకల్ప ఏరియాలో మాస్‌లైన్ ప్రతినిధి బృందం శిథిల వ్యవస్థలో చేరిన అపార్ట్‌మెంట్‌లను పరిశీలించారు. వర్షాకాలం కారణంగా ఏక్షణం ఏంజరుగుతుందోనని భయంలో 748 కుటుంబాలు భయంగా రోజులు గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శిరోమణి, ఝాన్సీ, కేశ్రీనివాస్, ఆజాద్, శోభ, జాస్మిన్, సుజాత, రామారావు, కళ్యాణి, అంజమ్మ పాల్గొన్నారు.

సీజ్ చేసినా..

(5వ పేజీ తరువాయి)

కేంద్రంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.కోట్లలో వైద్య వ్యాపారం జరుగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు వరంగల్, నల్లగొండ, సరిహద్దు ఏపీలోని కృష్ణా జిల్లా నుంచి కూడా ప్రతిరోజు ప్రైవేటు ఆసుపత్రులకు పెద్దఎత్తున రోగులు రావడం, వైద్యసేవలు పొందుతారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద పెట్టే బిల్లుల విషయంలో ఆసుపత్రుల యాజమాన్యాలతోపాటు వైద్యం చేసిన డాక్టర్లు కూడా బిల్లులపై సంతకం పెట్టాలి. కానీ ఈ దొంగ బిల్లుల సంతకాల విషయంలో సంబంధిత డాక్టర్లపై ఇప్పటి వరకు ఎలాంటి కేసులు పెట్టకపోవడం చెప్పుకోదగిన విషయం. వైద్యారోగ్యశాఖ మెతక వైఖరి కారణంగా సీజ్ అవుతున్నా.. పేర్లు మార్చి మళ్లీ వేరే ఆసుపత్రులుగా తెరవడం, స్టేలు తెచ్చుకోవడం, మళ్లీ వైద్యాన్ని నడిపించడం జిల్లా కేంద్రం ఖమ్మంలో సాగుతున్న తంతు. ఇప్పటికైనా సీఎం రిలీఫ్‌ఫండ్ వైద్యసేవల విషయంలో ఆసుపత్రులపై నిఘా చర్యలు పెంచాలని పలువురు సూచిస్తున్నారు.

పనుల జాతరకు శ్రీకారం

కూసుమంచి, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన పనుల జాతర-25లో భాగంగా మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో పలుపనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. మొదటగా కందుల ఉమ అనే మహిళకు పశువుల కొట్టం నిర్మాణానికి రూ.85 వేలు మంజూరీ కాగా శంకుస్థాపన చేశారు. జిల్లానాయకులు వీరారెడ్డి, బీష్మాచారి, పంచాయతీ కార్యదర్శి దామోదర్, ఫీల్డ్అస్టెంట్ చిలకబత్తిన రాము పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేసిన నాయకులు

కృత్రిమ కొరతతోనే యూరియా సమస్య

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): యూరియాను కొందరు కృత్రిమంగా కొరత సృష్టించడం వల్లనే యూరియా కొరత ఏర్పడిందని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సహజంగానే ఆగస్టులో యూరియా అవసరం అధికంగా ఉంటుందన్నారు. కృత్రిమ కొరత సృష్టించడం వల్లనే యూరియా కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే కేంద్రంపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేయలేక చేతులెత్తేసి కేంద్రంపై ఆరోపణలు చేయడంతగదన్నారు.

వ్యసనాలతో బంధాలను కోల్పోతాం

» ప్రముఖ సహస్ర అవధాని గరికిపాటి నరసింహారావు

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలతో నిజజీవితంలో సంబంధాలు, ఆప్యాయతలు కోల్పోతామని, భావి పౌరులుగా వాటిపై పోరాటం చేయాలని ప్రముఖ సహస్ర అవధాని పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని స్వర్ణభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్‌బీఐటీ) అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కృత్రిమ మేథకు బానిసగా మారకూడదని, సర్వర్ సమస్య తలెత్తితే వ్యవస్థ అంతా స్తంభించి పోతుందన్నారు. మానవ మేధస్సు పూర్తిగా దానిపైన ఆధారపడ కూడదని అన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ఆసక్తి ఆలోచనలకు అనుగుణంగా వారిని వివిధ రంగాలలో ప్రోత్సాహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గండాల కృష్ణ, అకడమిక్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గరికపాటి

పోరాట యోధుడు షోయబుల్లాఖాన్

తిరుమలాయపాలెం, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు షోయబుల్లాఖాన్ అని జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పిండిప్రోలులో షోయబుల్లాఖాన్ వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్‌రెడ్డి మాట్లాడుతూ షోయబుల్లాఖాన్ జీవితమంతా కష్టాలతో కూడుకుందన్నారు. అనేక ఆటుపోట్లు ఎదుర్కొని ఆనాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడ్డారన్నారు. తన వ్యాసాల ద్వారా నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మందడి ఇజ్రాయేల్, సుమన్‌రెడ్డి, వీరన్న, యలమంద, రవికాంత్‌రెడ్డి, గండమాల సుందర్‌రావు, వెంకటేశ్వర్లు, సీఐటీయు మండలనాయకులు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మడుపల్లి పాఠశాలకు బీరువా బహూకరణ



బీరువా అందజేసిన దృశ్యం

మధిరరూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామంలో రైస్‌మిల్లు నిర్వహిస్తున్న చెరుకూరి హన్మంతరావు కుమారులు చెరుకూరి రామారావు, నాగేశ్వరరావులు రూ.15వేలు విలువ గల బీరువాను శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా బీరువాను అందజేసిన దాతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీవి సాయి కృష్ణమాచార్యులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

కల్లూరు సీహెచ్‌సీలో వైద్యుల కొరత

» అవస్థలు పడుతున్న రోగులు

» పదిమంది వైద్యులకు ఒకే వైద్యుడు



వైద్యసేవలు అందిస్తున్న ఒకే ఒక వైద్యుడు



కల్లూరు ప్రాంతీయ వైద్యశాల

కల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రాంతీయ వైద్యాశాలను వైద్యుల కొరత వేధిస్తోంది. ఇక్కడ రోగులకు తగినట్లుగా వైద్యులు లేక ఆసుపత్రికి వస్తున్న రోగుల నాడిపట్టే వైద్యులు కరువయ్యారు. దీంతో ఈ ప్రాంత పేద ప్రజలకు ప్రభుత్వం తరుపున మెరుగైన వైద్యసేవలు అందడం లేదని పలువురు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆసుపత్రిలో నిత్యం సగటున 120 మంది రోగులు వైద్యసేవలు పొందేందుకు వస్తున్నారు. ఇంత రద్దీగా ఉన్న ఈ ఆసుపత్రిలో కేవలం ఒకే వైద్యుడు సేవలందిస్తున్నాడు. రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న కల్లూరు ఆసుపత్రి పరిధిలో సుమారు 25 వేలకు పైగా జనాభా కూడ విస్తరించి ఉంది. ఆసుపత్రిలో పలు రకాల వ్యాధుల బారిన పడిన వారు వైద్యసేవలకు రాగా నిపుణులైన వైద్యులు ఉండని పరిస్థితి, సీజనల్ వ్యాధుల బారిన పడిన వారు ఆసుపత్రికి వస్తుండడంతో వారికి వైద్యం అందించే డాక్టర్ల కొరత రోగులను వేధిస్తోంది. వైద్యావిధాన పరిషత్ పరిధిలో గత మూడు సంత్సరాల క్రితం నేలకొండపల్లి, కల్లూరు, వైరా, తిరుమలాయపాలెం కేంద్రాల్లో ఒకే సారి ప్రాంతీయ వైద్యాశాలలు ఏర్పాటు కాగా కల్లూరు తప్ప మిగిలిన ఆసుపత్రుల్లో సగటున 6 నుంచి 10 మంది వరకు ప్రత్యేక వైద్యులు ఉన్నారని తెలిసింది. కల్లూరు ప్రాంతీయ వైద్యాశాలలో వైద్యుల కొరతతో నిరుపేదలు వైద్య సేవలు పొందలేక పోతున్నారు.

నియామకాలపై పట్టించుకోని పాలకులు

కల్లూరులోని ప్రాంతీయ వైద్యాశాలలో అవసరమైన మేరకు వైద్యులు లేక గడచిన మూడు సంత్సరాల నుంచి ఈ ప్రాంత ప్రజానీకం ఇబ్బందుల పడుతున్నారు. ఇక్కడ జనాభా పరిధిని దృష్టిలో ఉంచుకోని కనీసం పది మంది ప్రత్యేక వైద్యులు సేవలు అందించాల్సి ఉంది, వైద్యావిధాన పరిషత్ పరిధిలో గల ఈ ఆసుపత్రిలో నేటి వరకు వైద్యుల పోస్టులను భర్తీ చేయలేదు. నిరుపేదలు ప్రభుత్వ పరంగా వైద్య సేవలు పొందలేక పోతున్నారు. ప్రభుత్వ పాలకులు కూడా తమకు ఏమాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన కల్లూరు మండలా ప్రాంతానికి చెందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర మంత్రిగా కీలక పాత్ర వహిస్తున్నారు. సతుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కూడా ప్రత్యేక దృష్టి సారించి, కల్లూరు ప్రాంతీయ వైద్యశాలలో అవసరానికి తగ్గ ప్రత్యేక వైద్యులను నియమించేలా చర్యలు తీసుకోవాలని పజలు కోరుతున్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన తహసీల్దార్

కారేపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కారేపల్లి మండల కేంద్రంలోని కస్తూర్భాగాంధీ పాఠశాలలో శుక్రవారం తహసీల్దార్ రమేష్ విద్యార్థినుల కోసం తయారు చేసిన భోజనాన్ని తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో విద్యార్థుల కోసం తయారు చేస్తున్న భోజనం వికటించి అశ్వస్థత చెందుతుడడంతో కలెక్టర్ అదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వంటశాల, సరుకులు నిల్వఉంచిన గదులను తహసీల్దార్ పరిశీలించారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు సొంత బిడ్డల్లా చూసుకోవాన్నారు. వేడివేడి అన్నం వడ్డించాలని సూచించారు. పరిసరా ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



బోనకల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామంలో గురువారం అర్ధరాత్రి చాపలమడుగు అర్జున్‌రావు(50) గుండె నొప్పితో మృతి చెందాడు. మూత్ర విసర్జన కోసం బయటకు రాగా, అక్కడిక్కడే కుప్పకూలాడు. సోదరి చూసి ఇరుగు పొరుగు వారిని పిలవగా అప్పటికే మృతి చెందాడు.

మొదలైన పనుల జాతర

ఎర్రుపాలెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండో విడత పనుల జాతర కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే కొత్త పనులను ఏకకాలంలో ప్రారంభించడానికి పనులు జాతర 2025కార్యక్రమానికి మధిర వ్యవసాయమార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు శ్రీకారం చుట్టారు. క్లస్టర్ డీఆర్పీఏ ఏపీడీ ఆర్.రామకృష్ణ, ఎంపీడీవో సురేంద్ర, ఎంపీవో గంధం శ్రీలక్ష్మి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది ఏపీవో నాగరాజు, టీఏలు , పంచాయతీ కార్యదర్శులు, మేట్స్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పథకాలతో ఆర్థిక భరోసా

సత్తుపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి పథకాలతో ఆర్థిక భరోసా లభిస్తుందని, తద్వారా కుటుంబాలు పురోగతిని సాధించి సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ చిన్న నాగేశ్వరరావు అన్నారు. ఇందిరా మహిళా శక్తి-ఉపాధి భరోసాలో భాగంగా మండలంలోని గంగారంలో నూతనంగా పూర్తయిన పశువులు, గొర్రెలు, కోళ్ల షెడ్లు, ఇంకుడు గుంతలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్లు, క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పెరటి కోళ్ల పెంపకం, డెయిరీ యూనిట్, పిండి గిర్నీ, స్కూల్ యూనిఫామ్ ఇతర స్వయం ఉపాధి పథకాలతో ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. 2024-25 ఎక్కువ రోజులు పనిచేసిన దివ్యాంగులకు, ఉత్తమ ఎంపీడబ్ల్యూలకు, స్వచ్ఛందంగా మొక్కలు పెంచే వ్యక్తులకు గ్రామసభలో సన్మానించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ ఎం.బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి

» సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

వేంసూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరికి సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ మాణిక్యరావుకు ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. రైతులు యూరియా కోసం సొసైటీల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. స్పందించిన తహసీల్దార్ మాణిక్యరావు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీఇవ్వడంతో ధర్నా విరమించారు. సీపీఎం నాయకులు మోరంపూడి వెంకటేశ్వరరావు, మల్లూరి చంద్రశేఖర్, లక్ష్మీ, శ్రీదేవి, రాణి రుద్రమ్మదేవి, శరత్‌బాబు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

చింతకాని, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు మండల పరిధిలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, కూరపాటి కిషోర్, నాయకులు పాల్గొన్నారు.

మధిర, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను శుక్రువారం కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పంపిణీ చేశారు.కాంగ్రెస్ నాయకులు నిడమానూరి వంశీ, చావా వేణు, యన్నం కోటేశ్వరరావు, పాటిబండ్ల సత్యంబాబు, కర్నాటి రామారావు, అద్దంకి రవి, జహంగీర్, రమణ, బాబు, సంగయ్య, చక్రీ, వెంకయ్యబాబు, మాగం ప్రసాద్, తలుపుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సన్మానం

చింతకాని, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో భాగంగా అధిక పని దినాలు నమోదు చేసిన మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ చెరుకూరి సంధ్యమ్మతోపాటు ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ పారిశుధ్య పనుల్లో మెరుగైన సేవలందించనందుకు మల్టీ పర్పస్ వర్కర్ పిల్లి బుచ్చయ్యను ఆత్మ జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల గోవిందరావు శాలువాతో సన్మానించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతకాని, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతంపేట గ్రామానికి చెందిన మేడ వెంకయ్య(49) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న వెంకయ్య గురువారం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుమారుడు జాషువా శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

» సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



లంకపల్లి గ్రామంలో పీటీఆర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

సత్తుపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాలతో పాటు పట్టణంలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం ఆమె సత్తుపల్లిలో పర్యటించి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. వనమహోత్సవంలో భాగంగా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక కాకర్లపల్లి రోడ్డులో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. అదేవిధంగా సత్తుపల్లి మండలంలోని సదాశివునిపేటలో రూ.53లక్షల వ్యయంతో నిర్మించిన 3.15ఎంవీఏ సామర్థ్యం కలిగిన అదనపు పీటీఆర్, వేంసూరు మండలం లింగపాలెంలో రూ.53లక్షల వ్యయంతో అమర్చిన 3.15ఎంవీఏ సామర్థ్యం కలిగిన పీటీఆర్‌లను ప్రారంభించారు. పీటీఆర్‌ల ఏర్పాటుతో పరిసర ప్రాంతాలు, గ్రామాలలో నిరంతరమైన విద్యుత్‌ను అందించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ట్రాన్స్ కో ఏడీఈలు ప్రసాద్ బాబు, ఎన్.సతీష్, ఏఈలు శరత్‌బాబు, కావ్య, అంకారావు, బుజేంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుబల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): లంకపల్లి ప్రాంత రైతులు, విద్యుత్ వినియోగదారులకు లోవోల్టేజీ సమస్య తీరుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. కొత్త లంకపల్లి గ్రామంలో రూ.1.06కోట్లతో లంకపల్లి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పీటీఆర్-5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు లంకపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో రైతులు, విద్యుత్ వినియోగదారులు ఇబ్బందుల పడ్డారని ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లంకపల్లి, కొత్త లంకపల్లి, చౌడారం తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఖమ్మం ఎస్ఈ శ్రీనివాసాచారి, డీఈఈ రాములు, ఏడీఈ సతీష్, ఎంఆర్‌టీ డీఈ భద్రుపవర్, లంకపల్లి, పెనుబల్లి ఏఈలు భుజంగకుమార్, రవితేజ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంది వెంకటేశ్వర్లు, కల్లూరు ఏఎంసీ వైస్‌చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, మందపాటి వెంకటరెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాలతో గురుకుల విద్యార్థులు విలవిల

బోనకల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బోనకల్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గడచిన నాలుగు రోజులుగా విద్యార్థులు వైరల్ ఫీవర్లతో విలవిలలాడుతున్నారు. వైద్య సిబ్బంది గురుకుల పాఠశాలలో వైద్య పరీక్షలను నిర్వహించి వైద్య సేవలందించారు. కొంతమందికి జ్వరాలు తగ్గినా, మరికొంత మంది విద్యార్థినులు జ్వరాలతో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా ఆందోళన చెందాల్సిన పని లేదని, జ్వరాలు తగ్గుముఖం పడుతున్నాయని పీహెచ్‌సీ వైద్యాధికారిణీ స్రవంతి తెలిపారు. అన్ని రకాలుగా వైద్య సేవలందిస్తున్నామన్నారు. ఈ విషయం పై గురుకుల పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్య సేవలందిస్తున్నామని, జ్వరాల తీవ్రత తగ్గిపోతుందని తెలిపారు. పూర్తి సమయం కేటాయించి విద్యార్థులకు అన్ని రకాలుగా సేవలందిస్తున్నామని పేర్కొన్నారు.

తూటికుంట్లలో డెంగ్యూ కేసు నమోదు

బోనకల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూటికుంట్ల గ్రామంలో శుక్రవారం డెంగ్యూ కేసు నమోదైంది. గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న 13 ఏళ్ల విద్యార్థి నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిసింది. వైద్య పరీక్షలను చేయించగా డెంగ్యూ పాజిటివ్ వచ్చింది. గ్రామాల్లో వరుసగా ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. వైద్య సిబ్బంది పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. కాని కొంతమందికి జ్వరాల తీవ్రత తగ్గడం లేదని మండలంలో చర్చ జరుగుతుంది.

చిత్తశుద్ధితో పనిచేసిన కార్మికులకు సన్మానం

కల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామంలో శుక్రవారం గ్రామసభ జరిగింది. ఈ సభలో గ్రామ పంచాయితీ కార్మికుడు ఇంటి రామారావును, నర్సరీ వనసేవకుడు ఇంటి పెద్ద పిచ్చయ్యలను స్థానిక ప్రముఖులు కుమ్మరి రామారావు, కొంగర రామకృష్ణ, పంచాయితీ కార్యదర్శి మహేష్‌లు శాలువలతో సత్కరించారు. గ్రామ పంచాయితీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమంలో చిత్తశుద్ధితో పనిచేసి మంచి గుర్తింపు పొందిన ఇంటి రామారావు, ఉపాధి హామీలో 100 పనిచేసిన నర్సరీ వనసేవడు ఇంటి పెద్ద పిచ్చయ్య ప్లాంటేషన్ నిర్వహణలో పూర్తిస్థాయిలో విధులు నిర్వహించి రహదారుల వెంట మొక్కలు సంరక్షణలో సేవలు అందించాడు. వారి సేవలను గర్తించి గ్రామ పంచాయితీ తరుపున శాలువలతో ఘనంగా సన్మానించారు. ఖమ్మంపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పనుల జాతర



పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వైరా, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పనుల జాతర జరుగుతుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి వైరా మండలంలో పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వైరా మునిసిపాలిటీలోని తల్లాడ వైపు వెళ్లే జాతీయ ప్రధాన రహదారి పక్కన రూ.23లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజీకి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆతర్వాత విప్పలమడక గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.92లక్షలతో నిర్మించనున్న 26రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రూ.20లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పల్లెలు, పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రజాపాలనలోనే సాధ్యమని తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న రైతు రుణ మాఫీ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, వైరా, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, విప్పలమడక మాజీ సర్పంచ్‌లు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, కొలికొండ వీరభద్రం, ఎంపీడీవో సక్రియ, తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, పీఆర్ డీఈఈ వెంకటేశ్వర్లు, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, అశోక్, బోళ్ల గంగారావు, బీడీకే. రత్నం పాల్గొన్నారు.

సభకు హాజరుకాని అధికారులకు నోటీసులు

ఏన్కూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. అభివృద్ధి పనుల జాతర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గార్లొడ్డు గ్రామంలో సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు. అభివృద్ధి పనుల జాతర సభకు ఐటీడీఏ ఏఈ హాజరుకాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. సభకు హాజరుకాని అధికారులకు నోటీసులు జారీచేయాలని తహసీల్దార్‌కు సూచించారు. ఎంపీడీవీ జీవీఎస్ నారాయణ, తహసీల్దార్ శేషగిరిరావు, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, నాయకులు బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు నాయకులు ధర్మారావు, లాలునాయక్, పటాన్ జీద్, వరశంకరప్రసాద్, నాగేశ్వరరావు, లచ్చిరాంనాయక్ పాల్గొన్నారు.

కొణిజర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేంవత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల అభివృద్ధి కోసమే పని చేస్తుందని, మాయమాటలు చెప్పి రాష్ట్రాన్ని అప్పులుపాలు చేసిన కేసీఆర్ లాగే చేసే ప్రభుత్వం కాదని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. 2025 పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని తనికెళ్లలో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. రాష్ట్ర గిడ్డంగులసంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కొణిజర్ల గోపవరం సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, ఎంపీడీవో ఉపేంద్రయ్య, ఏపీఎం చిన్నవెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు, మాజీ ఎంపీపీ గోసు మధు, పుల్లయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రక్కుల దొంగ అరెస్టు

చింతకాని, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఖాళీ ప్రదేశాల్లో నిలిపి ఉంచిన ట్రాక్టర్ ట్రక్కులను దొంగిలిస్తున్న ఎన్‌టీఆర్ జిల్లా వత్సవాయి మండల దబ్బాకుపల్లి చెందిన చింతల నరేంద్రను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ నెల 15న పొద్దుటూరు గ్రామంలో తన ట్రాక్టర్ ట్రక్కును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించనట్లు చింతకాని పోలీస్ స్టేషన్‌లో పాసంగుల పాటి విష్ణువర్ధన్ అను వ్యక్తి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దొంగల కోసం గాలిస్తున్నారు. ఈ నెల 21వ తేదీన బోనకల్-ఖమ్మం రోడ్డుపై నామవరం క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను చూసి ఓ ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టరును వెనక్కు తిప్పుకునే క్రమంలో పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. డ్రైవర్‌ను విచారించగా పొద్దుటూరు గ్రామంలో రెండు, కొణిజర్ల గ్రామంలో ఒక ట్రక్కును దొంగిలించినట్లుగా తెలిపాడు. దొంగిలించిన ట్రక్కుల విలువ రూ 4.60 లక్షలు ఉంటుందని, దొంగిలించిన ట్రక్కును ఉంచేందుకు సహకరించిన నరేంద్ర స్నేహితుడు ముప్పల ఉదయ్ కిరణ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు నరేంద్రను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగుల్ మీరా తెలిపారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట

ముదిగొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం కట్టకూరు గ్రామంలో శుక్రవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతులు విద్యుత్ మోటర్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని సూచించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తీసుకోవాల్సిన భద్రత గురించి వివరించారు. విద్యుత్‌శాఖ అధికారులకు తెలియకుండా ట్రాన్స్‌ఫార్మర్లకు ఫీజులు వేయడం లాంటివి చేయవద్దన్నారు. విద్యుత్ వాడకంపై భద్రతా సూత్రాలను పాటించాలని రైతులకు ఆయన సూచించారు. విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి ఎమ్మెల్యే నివాళులు

తల్లాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన తల్లాడ-3 మాజీ ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి రామతులిశమ్మకు సత్తుపనల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టాదయానంద్ దంపతులు నివాళులర్పించారు. శుక్రవారం నారాయణపురంలో రామతులిశమ్మ మృతదేహాన్ని ఎమ్మెల్యే దంపతులు సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆమె భర్త మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డిని పరామర్శించి ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీలు దొడ్డా శ్రీనివాసరావు, కట్టా కృష్ణార్జునరావు, సొసైటీ చైర్మన్లు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దిరిశాల నరసింహారావు, వివిధ పార్టీల నాయకులు దుగ్గిదేవర వెంకట్‌లాల్, కొమ్మినేని వెంకటేశ్వర్లు, శీలం సత్యనారాయణరెడ్డి, కాపా సుధాకర్, సరికొండ శ్రీనివాసరాజు, కృష్ణారావు, జనార్ధన్‌రెడ్డి, జక్కంపుడి కిషోర్, సుబ్బిరామిరెడ్డి ఉన్నారు.


ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఎస్ఐ

వైరా, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శుక్రవారం వైరా ఎస్ఐ పి.రామారావు తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. యూరియా కొరత సృష్టించి రైతులను ఇబ్బందిపెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి షరతులు లేకుండా వారు అడిగిన ఎరువులను విక్రయించాలని స్పష్టం చేశారు. షరతులు విధిస్తే డీలర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ మందులు విక్రయించవద్దని, నాణ్యమైన పురుగుమందులు, ఎరువులను మాత్రమే విక్రయించాలని సూచించారు. ప్రతిరోజూ బోర్డు మీద ఎరువుల నిల్వల వివరాలను ప్రదర్శించాలన్నారు.

పందిళ్లపల్లిలో చోరీ

చింతకాని, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో వత్సవాయి వెంకటేశ్వర్లు ఇంట్లో చోరి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో కలసి మూడు రోజుల క్రితం ఖమ్మంలో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని చుట్టుపక్కల వారు ఆయనకు సమాచారం అందజేశారు. వెంకటేశ్వర్లు ఇంటికి వచ్చి చూడగా బీరువా పగులగొట్టి ఉండటంతో చోరి జరిగిందని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. చోరి జరిగిన ఇంటిని పోలీసులు పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం క్లూస్ టీం బృందం వేలిముద్రలను సేకరించారు. గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి ప్రవేశించి రూ.67 వేల నగదుతోపాటు 15 తులాల వెండి, తులం బంగారం ఆభరణాలను దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్ మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మునిసిపల్ కమిషనర్ జాయినింగ్‌లో హైడ్రామా



బాధ్యతలు చేపట్టిన గురులింగం

బదిలీ అయిన చింతా వేణు

వైరా, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపల్ కమిషనర్‌గా యు.గురులింగం శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం పలు నాటకీయ పరిణామాలు జరిగాయి. దీంతో ఆయన బాధ్యతలు తీసుకున్నారా..? లేదా బదిలీ అయిన కమిషనర్ వేణునే ఇక్కడ కమిషనర్‌గా ఉన్నారా..? అనే మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. స్థానిక కాంగ్రెస్ నాయకుల వత్తిళ్ల మేరకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సూచనలతో కమిషనర్ జాయినింగ్ వ్యవహారంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయని ప్రచారం జరుగుతోంది. ఈనెల 20వతేదీన రాష్ట్రంలో మూకుమ్మడిగా 47మంది మునిసిపల్ కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. దాదాపు ఏడాదిన్నర కాలంగా వైరా మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న చింతా వేణును ఉమ్మడి నల్గొండ జిల్లా నందికొండ మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో నందికొండ మునిసిపల్ కమిషనర్‌గా ఉన్న గురులింగంను వైరాకు బదిలీ చేసింది. కమిషనర్ వేణు బదిలీని ఆపేందుకు గురువారమే కొంతమంది కాంగ్రెస్ నాయకులు రంగప్రవేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వైరా కమిషనర్‌గా వేణును కొనసాగించాలని ఎమ్మెల్యేపై వత్తిడి తీసుకువచ్చారు. ఈ తంతు జరుగుతుండగానే గురులింగం వైరా వచ్చి మునిసిపల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టినట్లు తమ ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా నివేదించినట్లు స్వయంగా ఆయనే కొంతమంది విలేకరులకు ఫోన్లో స్పష్టం చేశారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత కారేపల్లి పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను గురులింగం కలిశారు. ఆవెంటనే పరిస్థితులు మొత్తం మారిపోయి నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కనీసం రెండునెలలవరకైనా కమిషనర్‌గా వేణును కొనసాగించాలనే పట్టుదలతో కాంగ్రెస్ నాయకులు ఉండడంతో అదే విషయాన్ని గురులింగం దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. తాను బాధ్యతలు చేపట్టినట్లు చెప్పిన గురులింగం అతర్వాత తాను బాధ్యతల్లో చేరానో లేదో స్పష్టత ఇవ్వలేకపోయారు. ఇదే విషయమై మునిసిపల్ మేనేజర్ సుధాకర్‌ను, ఇతర అధికారులు, సిబ్బందిని ప్రశ్నించేందుకు ప్రయత్నించగా మేనేజర్ పలుసార్లు ఫోన్ కట్ చేసి ఆతర్వాత ఏకంగా స్విచ్ఛాఫ్ చేశారు. మిగిలిన మునిసిపల్ కార్యాలయంలోని శాశ్వత, తాత్కాలిక సిబ్బంది వ్యవహారశైలి కూడా అదే తీరుగా సాగింది. మొత్తంగా వైరా మునిసిపల్ కమిషనర్ గురులింగమా...? లేక వేణునా...? అనేది ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధికి, కాంగ్రెస్ నేతలకు మాత్రమే తెలుసు తప్ప మీడియాకు, ప్రజలకు మాత్రం స్పష్టత కరువైంది.

హిందూ శ్మశాన వాటిక స్థలం అప్పగింత

మధిర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మధిర లో ఆక్రమణకు గురైన హిందూ శ్మశాన వాటిక స్తలం తో పాటు డొంక స్తలాన్ని రెవిన్యూ అదికారులు మునిసిపాలిటీ అధికారులకు శుక్రవారం అప్పగించారు. మధిర లో హిందూ శ్మశాన వాటిక స్తలం ఆక్రమణకు గురైన విషయాన్ని ఆంధ్రజ్యోతి ఎనిమిది నెలల క్రితం వెలుగు లోకి తేవటంతో వెంటనే డిప్యూటీ స్పీకర్ మల్లు భట్టి విక్రమార్క ఆక్రమణ పై సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని అప్పటి జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చారు. జిల్లా సర్వే అదికారులు మధిర తహశీల్ధార్ సమక్షంలో సర్వే చేసారు. సర్వేలో శ్మశాన వాటిక స్తలం 2158 చ.గజాలు, డొంక స్తలం 3245 చ.గజాలు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించడంతో రెవిన్యూ అదికారులు వాటికి హద్దులు నిర్ణయించి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మొత్తం స్తలాన్ని మునిసిపల్ అదికారులకు అప్పగించారు. తహసీల్ధార్ రాంబాబు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఆర్.ఐ భానుప్రసాద్, మునిసిపల్ డి.ఈ నరేష్ రెడ్డి, సర్వేయర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



సీజ్ చేసినా..

(5వ పేజీ తరువాయి)

కేంద్రంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.కోట్లలో వైద్య వ్యాపారం జరుగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు వరంగల్, నల్లగొండ, సరిహద్దు ఏపీలోని కృష్ణా జిల్లా నుంచి కూడా ప్రతిరోజు ప్రైవేటు ఆసుపత్రులకు పెద్దఎత్తున రోగులు రావడం, వైద్యసేవలు పొందుతారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద పెట్టే బిల్లుల విషయంలో ఆసుపత్రుల యాజమాన్యాలతోపాటు వైద్యం చేసిన డాక్టర్లు కూడా బిల్లులపై సంతకం పెట్టాలి. కానీ ఈ దొంగ బిల్లుల సంతకాల విషయంలో సంబంధిత డాక్టర్లపై ఇప్పటి వరకు ఎలాంటి కేసులు పెట్టకపోవడం చెప్పుకోదగిన విషయం. వైద్యారోగ్యశాఖ మెతక వైఖరి కారణంగా సీజ్ అవుతున్నా.. పేర్లు మార్చి మళ్లీ వేరే ఆసుపత్రులుగా తెరవడం, స్టేలు తెచ్చుకోవడం, మళ్లీ వైద్యాన్ని నడిపించడం జిల్లా కేంద్రం ఖమ్మంలో సాగుతున్న తంతు. ఇప్పటికైనా సీఎం రిలీఫ్‌ఫండ్ వైద్యసేవల విషయంలో ఆసుపత్రులపై నిఘా చర్యలు పెంచాలని పలువురు సూచిస్తున్నారు.